Telanganasamajam.com

# తెలంగాణ సమాజం

తెలుగు దినపత్రిక

హైదరాబాద్: ఎడిటర్ : పి. రమేష్ సంపుటి : 02 సంచిక : 294 14 ఆదివారం డిసెంబర్ 2024 పేజీలు :08 వెల: రూ. 3.00



మిగతా 2 లో

## నిధుల విడుదలలో కేంద్రం చొరవ చూపాలి

పెండింగ్ లో ఉన్న రూ. 1800 కోట్లు తక్షణమే ఇవ్వండి

ఏపీ నుండి వచ్చే రూ.408 కోట్లను ఇప్పించండి

రూ. 2,547.07 కోట్ల రికవరీ ఆదేశాలు ఏకపక్షంగా ఉన్నాయి

మరోసారి సమీక్షించి కేంద్ర ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలి

నిర్మలా సీతారామన్ ను కోరిన సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణకు రావాల్సిన నిధులు అందేలా చూడాలని వినతి

కేంద్ర మంత్రులతో సీఎం రేవంత్ రెడ్డి వరుస భేటీలు

కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ తో భేటీ

పెండింగ్ రైల్వే ప్రాజెక్ట్ లపై సీఎం చర్చ

కాజీపేటలో ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీకై విజ్ఞప్తి

**న్యూఢిల్లీ,డిసెంబర్13(తెలంగాణ సమాజం):**

తెలంగాణకు రావాల్సిన నిధులు అందేలా చూడాలని కేంద్రాన్ని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రులను కలిశారు. ఈ సంధర్భంగా కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి పలు కీలక అంశాలపై సుధీర్ఘంగా చర్చించారు. తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో కేంద్రం చొరవ చూపాలని సీఎం ప్రత్యేకంగా కేంద్రాన్ని కోరారు. రాజస్థాన్ పర్యటన పూర్తి చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రులతో వరుసగా భేటీ అయ్యారు.

## రాజ్యాంగం అంటే సంఘ్ బుక్ కాదు

### ఎందరో మహానుభావుల అనుభవసారం

### నెహ్రూ పేరునే ఎన్నటికీ చెరిపేయలేరు

### లోక్‌సభలో రాజ్యంగంపై చర్చలో ప్రియాంక

**న్యూఢిల్లీ,డిసెంబర్13(తెలంగాణ సమాజం):**

భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకొని 75వ ఏడాదిలోకి అడుగుపెట్టిన సందర్భంగా లోక్‌సభలో ప్రత్యేక చర్చ జరుగుతోంది. జమిలిపైనా ప్రభుత్వం ముందడుగు వేయడంతో వాడీవేడీగా చర్చ సాగింది. ఎందరో మహానుభావుల అనుభవ సారం మన రాజ్యాంగం అని అన్నారు. ఇందులో విపక్షాల తరపున కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా చర్చను ప్రారంభించారు. ఎంపీగా ఇటీవలే పార్లమెంట్‌లో అడుగుపెట్టిన ఆమె.. లోక్‌సభలో ప్రసంగం చేయడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికార భాజపా, ఆరెస్సెస్‌పై విమర్శలు చేశారు. రాజ్యాంగం అంటే సంఘ్ బుక్ కాదని ఆర్ఎస్ఎస్‌ను ఉద్దేశించి దుయ్యబట్టారు. భాజపా ఎల్లప్పుడూ గతం గురించే మాట్లాడుతుంది.



మిగతా 2 లో

## అల్లుఅర్జున్ అరెస్ట్ అక్రమం

### ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కెటిఆర్

**హైదరాబాద్,డిసెంబర్13తెలంగాణ సమాజం):**

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అరెస్టుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. జాతీయ పురస్కారం అందుకున్న స్టార్‌ను అరెస్టు చేయడం పాలకుల అభద్రతా భావానికి ఇది పరాకాష్ట అని విమర్శించారు. సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాట బాధితులకు పూర్తిగా సానుభూతి తెలుపుతాను.. కానీ ఘటనలో నిజంగా తప్పు చేసింది ఎవరని కేటీఆర్ ప్రశ్నించారు. ఘటనకు నేరుగా బాధ్యుడు కానీ అల్లు అర్జున్‌ను సాధారణ నేరగాడిలా ట్రీట్ చేయడం సరికాదని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వ తీవ్ర చర్యను ఖండిస్తున్నానని తెలిపారు. హైడ్రా కూల్చివేతలతో ఇద్దరి చావుకు బాధ్యుడైన రేవంత్ రెడ్డిని కూడా ఇదే లాజిక్‌తో అరెస్టు చేయాలని సూచించారు. సంధ్య థియేటర్ తొక్కిసలాటలో మహిళ మృతి చెందిన కేసులో ఇవాళ ఉదయం అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఆయనపై అల్లు అర్జున్‌పై బీఎన్ఎస్ 118 (1), బీఎన్ఎస్ 105, రెడ్‌విత్ 3/5 సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. 105 సెక్షన్ (నాన్ బెయిలబుల్ కేసు) కింద ఐదు నుంచి పదేళ్లు జైలు శిక్ష పడే అవకాశమున్నట్టు తెలుస్తోంది.



## చట్టం తనపని తాను చేసుకు పోతుంది

2 లో

### అల్లు అరెస్ట్ విషయం తన ప్రమేయం లేదు

### మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ స్పష్టీకరణ

**న్యూఢిల్లీ,డిసెంబర్13(తెలంగాణ సమాజం):**

టాలీవుడ్ నటుడు అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి పోలీసులు అరెస్టు చేసిన ఘటన సంచలనంగా మారింది. అరెస్ట్ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించిన ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లు అర్జున్ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. ఇందులో తన జోక్యం ఏమీ ఉండదని.. చట్టం ముందు అందరూ సమానులేనన్నారు. చట్టపరమైన ప్రక్రియ జరుగుతుందన్నారు. తొక్కిసలాటలో ఒకరు చనిపోయిన నేపథ్యంలో పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని.. మోహన్ బాబు విషయంలో కోర్టు ఉత్తర్వులు ఉన్నాయన్నారు. ఈ నెల 4న ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సంధ్య థియేటర్‌లో పుష్ప-2 బెనిఫిట్ షో సందర్భంగా వచ్చారు. ఆ సమయంలోనే ఒక్కసారిగా తొక్కిసలాట జరిగింది. ఈ క్రమంలో రేవతి అనే మహిళ మృతి చెందింది.ఆమె కుమారుడు గాయాలకు గురయ్యాడు. ఘటనలో మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు అల్లు అర్జున్‌తోపాటు పలువురిపై కేసులు నమోదు చేశారు.

### ప్రియాంకగాంధీ ప్రసంగంపై

## రాహుల్ గాంధీ ప్రశంస

### ప్రతి విషయాన్ని సమగ్రంగా వివరించారని కితాబు



**న్యూఢిల్లీ,డిసెంబర్13 (తెలంగాణ సమాజం):**

లోక్ సభలో తన సోదరి ప్రియాంక గాంధీ చేసిన ప్రసంగంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రశంసలు కురిపించారు. తన తొలి ప్రసంగం కంటే ప్రియాంక ప్రసంగం బాగుందని కితాబునిచ్చారు. చాలా విషయాలపై ఆమె అద్భుతంగా మాట్లాడారన్నారు. ప్రతి విషయాన్ని సమగ్రంగా వివరించారన్నారు. ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో ప్రియాంకగాంధీ వయనాడ్ నుంచి గెలిచారు. తాజాగా రాజ్యాంగంపై జరిగిన చర్చ సందర్భంగా సభలో ఆమె తొలి ప్రసంగం చేశారు. ఈ ప్రసంగంపై రాహుల్ గాంధీ పైవిధంగా స్పందించారు.భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకొని 75వ ఏడాదిలోకి అడుగుపెట్టిన సందర్భంగా లోక్ సభలో ప్రత్యేక చర్చ జరుగుతోంది. విపక్షాల తరఫున ప్రియాంక గాంధీ చర్చను ప్రారంభించారు. ప్రసంగం సందర్భంగా ఆమె బీజేపీ, ఆరెస్సెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఒక వ్యక్తి కోసం 142 కోట్ల మంది ప్రయోజనాలను విస్మరిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నించిందన్నారు. కానీ లోక్ సభ ఫలితాల్లో పూర్తి మెజార్టీ రాకపోవడంతో బీజేపీ వెనక్కి తగ్గిందన్నారు.

## అత్యంత శక్తిమంతమైన మహిళగా నిర్మలమ్మ

### భారత్ నుంచి ముగ్గురు మహిళలకు

### చోటు ఫోర్బ్స్ 2024 జాబితా విడుదల



**న్యూఢిల్లీ,డిసెంబర్13(తెలంగాణ సమాజం):**


ఫోర్బ్స్ 2024 సంవత్సరానికిగాను విడుదల చేసిన ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన మహిళల జాబితాలో భారత్ నుంచి ముగ్గురు మహిళలకు చోటు దక్కింది. వారిలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అగ్రస్థానం సంపాదించుకున్నారు. వాస్తవానికి ఫోర్బ్స్ జాబితాలో నిర్మలా సీతారామన్ ఉండడం వరుసగా ఇది ఆరోసారి కావడం గమనార్హం. ఫోర్బ్స్ - ప్రపంచవ్యాప్తంగా అత్యంత శక్తిమంతమైన 100 మంది మహిళల జాబితాలో నిర్మలా సీతారామన్ 28వ స్థానంలో నిలిచారు. గతేడాది ఆమె 32వ స్థానంలో ఉండగా, ఇప్పుడు మరో నాలుగు స్థానాలు ఎగబాకడం విశేషం. ఇక, భారత్ నుంచి హెచ్‌సీఎల్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ రోష్నీ నాడార్ మల్హోత్రా ఈ జాబితాలో 81వ స్థానం దక్కించుకున్నారు. గతేడాది ఈమె 60వ స్థానంలో ఉన్నారు. బయోకాన్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజూందర్ షా తాజా జాబితాలో 82వ స్థానంలో నిలిచారు. గతేడాది కూడా ఆమె ఫోర్బ్స్ శక్తిమంతమైన మహిళగా చోటు దక్కించుకున్నారు. ఫోర్బ్స్ జాబితాలో యూరోపియన్ కమిషన్ చీఫ్ ఉర్సులా వాన్ దెర్ లెయెన్ మరోసారి అగ్రస్థానం దక్కించుకున్నారు. యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ అధిపతి క్రిస్టినా లగార్డ్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని రెండు, మూడు స్థానాలను సొంతం చేసుకున్నారు. బిల్‌గేట్స్ మాజీ భార్య మిలిందా ఫ్రెంచ్ గేట్స్ (8వ స్థానం), అమెజాన్ అధిపతి జెఫ్ బెజోస్ మాజీ సతీమణి మెకంజీ స్కాట్ (9వ స్థానం), ప్రముఖ పాప్ గాయని టేలర్ స్విఫ్ట్ (23 వ స్థానం) లాంటివారు ఈ జాబితాలో ఉన్నారు. ఇండియాలో తొలి, పూర్తిస్థాయి ఆర్థికమంత్రి అయిన నిర్మలా సీతారామన్, రాజకీయాల్లోకి రాకముందు బ్రిటన్ అగ్రికల్చర్ ఇంజినీర్స్ అసోసియేషన్, బీబీసీ వరల్డ్ సర్వీస్‌లలో కీలక పదవులు నిర్వర్తించారు.

## అల్లు అర్జున్ అరెస్ట్ అప్రజాస్వామికం

### బట్టలు కూడా వేసుకోనీయకపోవడం దారుణం

### మండిపడ్డ హోంశాఖ సహాయమంత్రి బండి

**న్యూఢిల్లీ,డిసెంబర్13(తెలంగాణ సమాజం):**



సినీ నటుడు అల్లు అర్జున్ అరెస్టుపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు. జాతీయ అవార్డు గ్రహిత అల్లు అర్జున్‌ను అరెస్టు చేసిన తీరు సరైనది కాదని మండిపడ్డారు. నేరుగా బెడ్‌రూంలోకి వచ్చి అరెస్టు చేస్తారా అని ప్రశ్నించారు. బట్టలు కూడా మార్చుకోనివ్వకుండా అరెస్టు చేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అల్లు అర్జున్ భారత సినిమాకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చారని బండి సంజయ్ తెలిపారు. అలాంటి వ్యక్తితో కాస్త మర్యాదగా వ్యవహరించాల్సిందని అభిప్రాయపడ్డారు. సంధ్య థియేటర్‌లో తొక్కిసలాటలో ఓ మహిళ మృతి చెందడం నిజంగా విచారకరమని తెలిపారు. కానీ ఆ తొక్కిసలాట పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లే జరిగిందని ఆరోపించారు. పుష్ప ది రైజ్ ఘన విజయం తర్వాత పుష్ప 2కి విపరీతమైన క్రేజ్ వచ్చిందని..

తెలంగాణ సమాజం
తెలుగు దినపత్రిక

తెలంగాణ సమాజం

## సంపాదకీయం

# ప్రార్థనా స్థలాల చట్టంపై పదే పదే చర్చ ఎందుకు?

భారతదేశం లౌకిక దేశం. పౌరులు స్వేచ్ఛగా తమ మతాలను ఆచరించవచ్చు. మత స్వేచ్ఛకు భంగం కలగకుండా చూడటం ప్రభుత్వాల విధి. అలాగే మతం ప్రాతిపదికన ప్రభుత్వాలు ఎటువంటి నిర్ణయాలు తీసుకోకూడదు. ఇక, మత స్వేచ్ఛకు సంబంధించిన ఎన్నో చట్టాలు ఉన్నాయి. వాటిలో ప్రముఖమైనది ప్రార్థనా స్థలాల చట్టం. 1947లో దేశానికి స్వతంత్రం వచ్చినప్పుడు అస్థిత్వంలో ఉన్న మతపరమైన కట్టడాలు. వాటి గుర్తింపు, స్వభావాన్ని, నిర్మాణాన్ని రక్షించేందుకు ఉద్దేశించిన చట్టం ఇది. మతపరమైన కట్టడాలు అంటే అవి దేవాలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారా లు...ఏవైనా కావచ్చు, 1947లో దేశానికి స్వతంత్రం వచ్చినప్పుడు వాటి స్వరూపం ఎలా ఉందో అలాగే కొనసాగించాలని ఈ చట్టం చెబుతోంది. అయోధ్యలో బాబ్రీ మసీదు స్థానంలో రామ మంది రం నిర్మించాలని బీజేపీ నాయకత్వంలో చేపట్టిన ఉద్యమం బలం పుంజుకోవడంతో కేంద్రంలోని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం 1991లో 'ది ప్లేస్ ఆఫ్ వర్షిప్ (స్పెషల్ ప్రొవిజన్స్)' చట్టం తీసుకొచ్చింది. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ దీనిని గట్టిగా వ్యతిరేకించింది. 1991లో అమల్లోకి వచ్చిన ఈ చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో అనేక కేసులు దాఖలయ్యాయి. సర్వోన్నత న్యాయస్థానం ఇప్పుడు వాటిని విచారిస్తోంది. కాగా, మతపరమైన ప్రార్థనా స్థలాలను సర్వే చేయాలని కోరుతూ కొత్తగా దాఖలయ్యే పిటిషన్లను స్వీకరించరాదని, ప్రస్తుతం విచారణలో ఉన్న పిటిషన్లపై తాత్కాలిక లేదా తుది ఉత్తర్వులు జారీ చేయరాదని దేశంలోని అన్ని కోర్టులను సుప్రీంకోర్టు తాజాగా ఆదేశిం చింది. ప్రార్థనా స్థలాల ప్రత్యేక నిబంధనల చట్టం, 1991 చెల్లుబాటుపై విచారణ జరిపి, తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు కోర్టులు సంయమనం పాటించాలని తెలిపింది. సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. దీంతో జ్ఞానవాపి, మథుర, సంభల్ సహా 10 మసీదులు, దర్గాలపై హిందూ పిటిషనర్లు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ నిలిచిపోయింది. వీటి మతపరమైన అసలు స్వభావాన్ని తెలుసుకునేందుకు సర్వే చేయాలని ఈ పిటిషనర్లు కోరుతున్నారు. సీజేఐ నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం 6 పిటిషన్లపై విచారణ సందర్భంగా ఈ ఆదేశాలను ఇచ్చింది. ప్రార్థనా స్థలాల ప్రత్యేక నిబంధనల చట్టం, 1991 నిబంధన లను సవాల్ చేస్తూ న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ్ దాఖలు చేసిన పిటిషన్ కూడా వీటిలో ఉంది. ఈ పిటిషన్లపై నాలుగు వారాల్లోగా స్పందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రార్థనా స్థలాల చట్టం1991 మీద దాఖలైన పిటిషన్ విషయంలో సుప్రీంకోర్టు చెప్పబోయే తీర్పు మీద దేశంలో ప్రస్తుతం వివాదంలో చిక్కుకున్న డజన్ల కొద్దీ ప్రార్థనాలయాల భవిష్యత్ ఆధారపడి ఉంది. ఇందులో ఎక్కువ భాగం కట్టడాలు ముస్లింలకు చెందినవి. వీటి మీద హిందూ సంస్థలు పిటిషన్లు దాఖలు చేశాయి. కోర్టు కేసుల్లో చిక్కుకున్న వాటిలో జ్ఞానవాపి, షాహి ఈద్గా, వారణాసి, మధురలోని రెండు వివాదాస్పద మసీదులు ఉన్నాయి. రెండు వారాల కిందట అజ్మీర్ దర్గా విషయంలో దాఖలైన పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం రాజస్థాన్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అజ్మీర్‌లో ప్రతిరోజూ వేలమంది సందర్శించే 13వ శతాబ్దానికి చెందిన ఈ సూఫీ మందిరాన్ని హిందూ ఆలయం మీద నిర్మించారని కోర్టులో పిటిషన్ దాఖలైంది. నెల రోజుల కిందట ఉత్తరప్రదేశ్‌లోని సంభల్ 16వ శతాబ్దానికి చెందిన మసీదులో సర్వే నిర్వహించాలని కోర్టు ఆదేశించడంతో హింస చెలరేగింది. ఇందులో నలుగురు మరణించారు. సర్వే నిర్వహించాలన్న కోర్టు నిర్ణయంపై ముస్లిం సంఘాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. కోర్టులు సర్వేకు ఆదేశాలు జారీ చేసినప్పుడల్లా ఉద్రిక్తతలు తలెత్తుతున్నాయి. జ్ఞానవాపి మసీదు విషయంలోనూ ఇదే జరిగింది. 17వ శతాబ్దంలో కాశీ విశ్వనాథుడి ఆలయాన్ని కూల్చివేసి మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు మసీదు నిర్మించారని హిందూ సంఘాలు ఆరోపించాయి. జ్ఞానవాపి మసీదులో సర్వే నిర్వహించాలన్న కోర్టు ఆదేశాలను ముస్లిం సంఘాలు వ్యతిరేకించాయి. ఇది 1991 ప్రార్థనా స్థలాల చట్టానికి విరుద్ధమనేది వారి వాదన. అయితే 2022లో సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ సర్వేను ఆపాలని చెప్పలేదు. 1947 ఆగస్టు 15నాటికి ఉన్నప్రార్థనాలయాల స్వభావాన్ని మార్చడానికి ప్రయత్నించనంత వరకు, వాటిపై దర్యాప్తును 1991 చట్టం నిరోధించలేదని ప్రధాన న్యాయమూర్తి చెప్పారు. ఈ ఉత్తర్వులను అనేక మంది విమర్శించారు. వివిధ ఆరోపణల వల్ల స్థలాల చారిత్రక స్థితిని నిర్ణయించడం అనేది మతాల మధ్య ఘర్షణలను, హింసను రెచ్చగొట్టే అవకాశం ఉంది. ఒకవేళ ఈ చట్టాన్ని తొలగించినా లేక బలహీనపరిచినా అది ఇలాంటి అనేక పిటిషన్లకు గేట్లు తెరవడం లాంటిదేనని ప్రతిపక్ష నాయకులు, ముస్లిం సంఘాల నేతలు భావిస్తున్నారు. దీని వల్ల దేశంలో హిందువులు, ముస్లింల మధ్య మతపరమైన ఉద్రిక్తతలు చెలరేగే అవకాశం ఉందని అంటున్నారు.

# రాజ్యాంగం అంటే సంఘ్ బుక్ కాదు

మొదటి పేజీ తరువాయి

కానీ, దేశ ప్రగతి కోసం ఇప్పుడేం చేస్తున్నారో వారు మాట్లాడాలన్నారు. దేశంలో జరిగే అన్నిటికీ నెహ్రూనే కారణమా? నెహ్రూ పేరును, ఆయన ప్రసంగాలను మీరు పుస్తకాల నుంచి తొలగించగలరేమో.. కానీ, స్వతంత్ర్య పోరాటంలో, జాతి నిర్మాణంలో ఆయన పాత్రను చెరిపేయలేరు' అని ప్రియాంక కౌంటర్ ఇచ్చారు.. ఈ సందర్భంగా 2017లో జరిగిన ఉన్నావ్ అత్యాచార ఘటనను ఆమె ప్రస్తావించారు. ఇలాంటి ఘటనల్లో బాధితులకు పోరాడే హక్కును రాజ్యాంగమే కల్పించిందన్నారు. ఈ సందర్భంగా అదానీ వ్యవహారంపై కాంగ్రెస్ ఎంపీ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. 'ఒక్కరిని కాపాడటం కోసం 142 కోట్ల మంది భారతీయుల ప్రయోజనాలను విస్మరిస్తున్నారు. సంపద, రోడ్లు, పోర్టులు, గనులు అన్నీ ఆయనకే ఇస్తున్నారు' అని మండిపడ్డారు. ప్రజల తరఫున పోరాడే ప్రతిపక్షాల గళాన్ని అణచివేసేందుకు తప్పుడు కేసులు పెడుతున్నారని దుయ్యబట్టారు. దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేసి విపక్ష నేతలపై వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు.ఇతర దేశాలతో పోలిస్తే మన స్వాతంత్ర్య పోరాటం ప్రత్యేకమైనది. సత్యం, అహింస అనే పునాదులపైనే మనం పోరాడాం. మన స్వాతంత్ర్య ఉద్యమం ప్రజాస్వామ్య గళం. దాన్నుంచి ఉద్భవించినదే రాజ్యాంగం. ఇది కేవలం డాక్యుమెంట్ కాదు.. అంబేడ్కర్, మౌలానా ఆజాద్, రాజగోపాలచారి, నెహ్రూ వంటి ఎంతోమంది నేతలు ఎన్నో ఏళ్ల పాటు తమ జీవితాలను అంకితం చేసి దీన్ని రూపొందించారు. ప్రజా హక్కులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళమెత్తే శక్తిని రాజ్యాంగం మనకు కల్పించింది. ఇది దేశ ప్రజలను కాపాడే 'సురక్షా కవచం'లా ఉంది. అయితే దీన్ని బద్దలుకొట్టేందుకు అధికార ఎన్డీయే ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేసింది. గత పదేళ్లలో ఈ రక్షణ కవచాన్ని బలహీనపర్చింది. లేట్రల్ ఎంట్రీ, ప్రైవేటీకరణ వంటి చర్యలతో రిజర్వేషన్లను బలహీనపర్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ మెజార్టీ వచ్చి ఉంటే రాజ్యాంగాన్ని మార్చాలని ఎన్డీయే భావించింది. అది జరగకపోవడంతో ఆ ప్రతిపాదనలపై వెనక్కి తగ్గింది. ఇది సంవిధాన్.. సంఘ్ రూల్ బుక్ కాదు' అని కాంగ్రెస్ ఎంపీ దుయ్యబట్టారు. కులగణన జరగాలని దేశ ప్రజలంతా కోరుకుంటున్నారని తెలిపారు.

# చట్టం తనపని తాను చేసుకు పోతుంది

మొదటి పేజీ తరువాయి

ఇప్పటికే ఈ వ్యవహారంలో ముగ్గురిని అరెస్టు చేశారు. అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేశారు. అల్లు అర్జున్‌పై బీఎన్ఎస్ 118 (1), బీఎన్ఎస్ 105, రెడ్‌విత్ 3/5 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. రేవతి మృతిపై అల్లు అర్జున్ దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేయడంతో పాటు ఆమె కుటుంబానికి రూ.25లక్షల సాయం ప్రకటించారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ క్రమంలో అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్టు చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్టు అనంతరం గాంధీ ఆసుపత్రిలో పరీక్షలు చేశారు. ఆ తర్వాత ఆయనను కోర్టులో హాజరుపరుచనున్నారు. మరో వైపు పుష్ప స్టార్ తరఫు న్యాయవాదులు హైకోర్టును ఆశ్రయించారు.

# నిధుల విడుదలలో కేంద్రం చొరవ చూపాలి

మొదటి పేజీ తరువాయి

ప్రధానంగా తెలంగాణ నిధులు, రైల్వే ప్రాజెక్ట పూర్తి, పలు అంశాలపై సీఎం రేవంత్ సుధీర్ఘ చర్చలు జరిపారు. కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ తో భేటీ కాగా, పెండింగ్ లో ఉన్న రైల్వే ప్రాజెక్ట్ లపై సీఎం చర్చించారు. అందులో కాజీపేటలో ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని, వికారాబాద్ %-% కృష్ణ స్టేషన్ల మధ్య పూర్తిగా రైల్వే శాఖ వ్యయంతో నూతన రైలుమార్గం నిర్మించాలని కోరారు.అనంతరం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ తో భేటీ కాగా కీలక అంశాలపై చర్చ సాగింది. వెనక బడిన జిల్లాలకు పునర్విభజన చట్ట ప్రకారం ఇవ్వాల్సిన నిధులను వెంటనే తెలంగాణకు విడుదల చేసేలా చూడాలని కేంద్ర మంత్రికి సీఎం సూచించారు. నాలుగేళ్ల నుండి పెండింగ్ లో ఉన్న రూ. 1800 కోట్లు తక్షణం విడుదల చేయాలన్నారు. ఉమ్మడి సంస్థల నిర్వహణ వ్యయం రూ.408 కోట్లను ఆంధ్రప్రదేశ్ నుండి ఇప్పించాలని కేంద్రాన్ని కోరారు.విదేశీ ఆర్థిక సహాయంతో చేపట్టిన ప్రాజెక్టులకు సంబంధించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య రుణాల పంపిణీ విషయంలో తెలంగాణ నుండి ఏకపక్షంగా రూ. 2,547.07 కోట్ల రికవరీకి కేంద్రం ఏకపక్ష ఆదేశాల పై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు సీఎం. అలాగే ఈ విషయంలో మరోసారి సమీక్షించి సరైన నిర్ణయం తీసుకోవాలని వినతి పత్రాన్ని కూడా సీఎం అందజేశారు. అయితే కేంద్రాన్ని సీఎం కోరగా, సానుకూల స్పందన వచ్చినట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా తెలంగాణ పట్ల వివక్షత చూపకుండా, రాష్ట్రానికి రావాల్సిన నిధులు త్వరితగతిన అందేలా చూడాలని సీఎం కోరారు. సీఎం వెంట తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు కూడా భేటీలలో పాల్గొని తమ వాణి వినిపించారు.

# అల్లు అర్జున్‌కు హైకోర్టులో ఊరట

**మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన కోర్టు**

**పుష్ప అరెస్ట్.. 14 రోజుల రిమాండ్**

**గాంధీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు**

**చంచల్‌గూడ జైలుకు తరలింపు**

**హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్**

**సోమవారం విచారిస్తామన్న హైకోర్టు**

**పుష్ప అరెస్ట్‌పై పిటిషనర్ ఆందోళన**

**కేసు ఉపసంహరించుకుంటానని వీడియో విడుదల**

**హైదరాబాద్,డిసెంబర్ 13(తెలంగాణ సమాజం):** సినీ నటుడు అల్లు అర్జున్ వ్యవహారంలో రోజంతా హైడ్రామా నడిచింది. ఆయనను అరెస్ట్ చేయడం, చంచల్‌గూడ జైలుకు తరలించడం, వెంటనే హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడం వంటివన్నీ చకచకా సాగిపోయాయి. అరెస్ట్ చేసి జైలుకు తరలించిన అనంతరం తెలంగాణ హైకోర్టులో అల్లు అర్జున్‌కు ఊరట లభించింది. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో ఆయన అరెస్టయిన క్రమంలో అల్లు అర్జున్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం నాలుగు వారాల పాటు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అల్లు అర్జున్ ఏ11గా పేర్కొన్న పోలీసులు.. మధ్యాహ్నం 1.30కి అరెస్టు చేసినట్లు రిమాండ్ రిపోర్టులో వెల్లడించారు. క్వాష్ పిటిషన్‌పై విచారణ అత్యవసరం కాదని.. సోమవారం వినాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టును కోరారు. అల్లు అర్జున్ అరెస్టయినందున బెయిల్ కోసం అవసరమైతే మరో పిటిషన్ వేసుకోవాలన్నారు. క్వాష్ పిటిషన్‌లోనే మధ్యంతర బెయిల్ ఇవ్వాలని అల్లు అర్జున్ తరఫు న్యాయవాది నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు.'అల్లు అర్జున్ తన ప్రతి సినిమా విడుదల రోజున థియేటర్‌కు వెళ్తారు. థియేటర్ యాజమాన్యం, నిర్మాత పోలీసులకు సమాచారం ఇచ్చారు. అల్లు అర్జున్ రాత్రి 9.40కి సంధ్య థియేటర్‌కు వెళ్లి మొదటి అంతస్తులో కూర్చున్నారు. తొక్కిసలాటలో మరణించిన మహిళ కింద అంతస్తులో ఉన్నారు' అని అల్లు అర్జున్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. మధ్యాహ్నం అడగ్గానే లంచ్ మోషన్‌కు అనుమతివ్వడం తప్పుడు సంకేతం ఇస్తుందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు తెలిపారు. క్వాష్ పిటిషన్‌లో మధ్యంతర బెయిల్ ఇవ్వొచ్చా? లేదా? అనే అంశంపై వాదించాలని ఈ సందర్భంగా హైకోర్టు పీపీకి సూచించింది. థియేటర్‌కు వెళ్లొద్దని అల్లు అర్జున్‌కు పోలీసులు ముందుగానే సమాచారం ఇచ్చారని పీపీ కోర్టుకు తెలిపారు. భారీగా జనం ఉంటారని తెలిసినప్పటికీ అల్లు అర్జున్ వెళ్లారని వివరించారు. మధ్యంతర బెయిల్ ఇవ్వాలని క్వాష్ పిటిషన్‌లో ఎక్కడా కోరలేదని పీపీ వాదనలు వినిపించారు. క్వాష్ పిటిషన్‌పై అత్యవసర విచారణ అవసరం లేదని, సోమవారం విచారించాలని కోరారు. పోలీసులకు సమాచారం ఇచ్చినప్పటికీ తగిన భద్రత ఇవ్వలేదని అల్లు అర్జున్ న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. పోలీసులు కూడా భద్రత కన్నా అల్లు అర్జున్‌ను చూసేందుకే ఎక్కువ ఉత్సాహం చూపారని తెలిపారు. అల్లు అర్జున్ భద్రత సిబ్బంది తోయడంతోనే తొక్కిసలాట జరిగినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు దారుడి భార్య మరణించింది. కుమారుడు వెంటిలేటర్‌పై ఉన్నాడని పీపీ కోర్టుకు వివరించారు. అందుకే అల్లు అర్జున్‌కు ఎలాంటి ఊరట ఇవ్వొద్దని పీపీ తన వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 'ఎఫ్ఐఆర్‌ను పూర్తిగా కొట్టివేయాలని పిటిషన్ వేశాం. పిటిషన్‌పై విచారణ కొనసాగుతుండగానే అరెస్టు చేశారు. అందువల్ల ఈ పిటిషన్ ద్వారానే మధ్యంతర బెయిల్ ఇవ్వొచ్చని గతంలో సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నందున మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరారు. అర్ణబ్ గోస్వామి, మహారాష్ట్ర ప్రభుత్వం కేసులో బాంబే కోర్టు ఇచ్చిన తీర్పును ఉదహరించడంతో వాటి ఆధారంగా హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. జైలు సూపరింటెండెంట్ కు రూ.50వేల వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. కేసు దర్యాప్తును, సాక్షులను ప్రభావితం చేయవద్దని అల్లు అర్జున్‌ను ఆదేశించిన హైకోర్టు తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. రెగ్యులర్ బెయిల్ కోసం నాంపల్లి కోర్టును సంప్రదించాలని సూచించింది. అంతకుముందు తొక్కిసలాట ఘటనలో అరెస్టయిన అల్లు అర్జున్‌కి బిగ్‌షాక్ తగలింది. ఆయన్ను 14 రోజుల రిమాండ్‌కు తరలించాలని నాంపల్లి కోర్టు న్యాయమూర్తి ఆదేశాలు జారీచేశారు. దీంతో అతడిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. బన్నీ రావటం వల్లే తొక్కిసలాట ఘటన జరిగిందనీ, అందుకే ఆయన్ను అరెస్టుచేశామని పోలీసులు కోర్టుకు నివేదించారు. పోలీసుల వాదనతో ఏకీభవించిన న్యాయమూర్తి అర్జునుకి రిమాండ్ విధించారు. అనంతరం చంచల్‌గూడ జైలుకు తరలించారు. చిక్కడపల్లి పోలీసులు శుక్రవారం నాడు ఆయన ఇంటి వద్ద అరెస్ట్ చేశారు. పుష్ప-2 విడుదల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే. అరెస్టు చేయడానికి తన ఇంటికి వచ్చిన పోలీసులకు అల్లు అర్జున్ సహకరించి స్టేషన్‌కు వచ్చారు. ఇప్పటికే సంధ్య థియేటర్ యజమానితోపాటు అక్కడ సెక్యూరిటీ వారిని కూడా పోలీసులు అరెస్ట్‌చేశారు. వైద్య పరీక్షల కోసం అల్లు అర్జున్ ను ఉస్మానియా ఆసుపత్రికి తీసుకుకెళ్లారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో అరెస్టయిన అల్లు అర్జున్‌కు వైద్య పరీక్షలు ముగిశాయి. అనంతరం ఆయన్ను పోలీసులు నాంపల్లి క్రిమినల్ కోర్టులో హాజరు పరిచేందుకు తరలించారు. గాంధీ ఆస్పత్రిలో అల్లు అర్జున్‌కు బీపీ, షుగర్ పరీక్షలతో పాటు, కొవిడ్-19 టెస్ట్ కూడా చేసినట్లు ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ సునీల్ తెలిపారు. అన్ని పరీక్షల్లో ఆయనకు సాధారణ ఫలితాలు వచ్చాయని వెల్లడించారు. ఈసీజీ పరీక్షలు కూడా నిర్వహించామని, భద్రతా కారణాల రీత్యా ఆయనను సూపరింటెండెంట్ కార్యాలయంలో వైద్యుల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం పోలీసులు ఆయన్ను నాంపల్లి క్రిమినల్ కోర్టుకు తరలించారు. అరెస్ట్ అంశంలో చట్టప్రకారం ముందుకెళ్తున్నామని పోలీసులు తెలిపారు. వైద్య పరీక్షల సందర్భంగా గాంధీ ఆస్పత్రికి వచ్చిన అల్లు అర్జున్‌ను చూసేందుకు ఆయన అభిమానులు, రోగులకు సహాయంగా వచ్చిన వారి బంధువులు ఎగబడ్డారు. ఫొటోలు, వీడియోలు తీస్తూ కనిపించారు. ఆస్పత్రి సిబ్బంది కూడా అల్లు అర్జున్‌ను ఫొటోలు తీసేందుకు ఆసక్తి చూపారు. అనంతరం నాంపల్లి కోర్టుకు హాజరుపర్చారు. అల్లు అర్జున్‌పై పలు సెక్షన్లలో కేసు నమోదైంది. దీంతో ఆయన తరఫు న్యాయవాది హైకోర్టుని ఆశ్రయించారు. పుష్ప 2 ప్రీమియర్ షోలు ఈనెల 4న రాత్రి 9.30 గంటలకు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సంధ్య థియేటర్ వద్దకు అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు. సరిగ్గా అదే సమయంలో అల్లు అర్జున్ తన సతీమణి స్నేహతో కలిసి థియేటర్‌కు వచ్చారు. థియేటర్ యాజమాన్యం ముందస్తుగా ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోలేదు. ఎంట్రీ, ఎగ్జిట్‌లో ఎలాంటి సెక్యూరిటీ ఏర్పాట్లు చేయలేదు. కాగా, బన్నీ రాకతో అక్కడ ఒక్కసారిగా సంభవించిన తొక్కిసలాటలో రేవతి (36) అనే మహిళ అక్కడికక్కడే మరణించగా, ఆమె కుమారుడు శ్రీతేజ గాయపడి, ఇప్పటికీ చికిత్స పొందుతున్నారు. ఇదిలావుంటే థియేటర్ వద్ద సంభవించిన తొక్కిసలాటకు గానీ, రేవతి మృతికి గానీ అల్లు అర్జున్‌కు సంబంధం లేదనీ, మృతురాలి భర్త భాస్కర్ మీడియాకు వెల్లడించారు. తమ




కేసును ఉపసంహరించుకుంటున్నట్లుగా ప్రకటించారు. అయితే, కేసు నమోదుచేసి అరెస్ట్ చేశామని హైదరాబాద్ సిపి సివి ఆనంద్ వెల్లడించారు. అయితే ఈ కేసులో సినీ నటుడు అల్లు అర్జున్ హైకోర్టును ఆశ్రయించారు. చిక్కడపల్లి పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టి వేయాలని కోరుతూ బన్ని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. శుక్రవారం ఆయన్ను అదుపులోకి తీసుకున్న కొద్దిసేపటికే అల్లు అర్జున్ తరఫు న్యాయవాది దీనిని అత్యవసర పిటిషన్‌గా విచారించాలని న్యాయస్థానాన్ని కోరారు. 'అత్యవసర పిటిషన్‌ను ఉదయం 10.30 గంటలకే మెన్షన్ చేయాలి కదా' అని ఈ సందర్భంగా కోర్టు ప్రశ్నించింది. బుధవారం రోజు పిటిషన్ ఫైల్ చేశామని, క్వాష్ పిటిషన్‌ను వేసినట్లు పోలీసుల దృష్టికి కూడా తీసుకెళ్లామని అల్లు అర్జున్ తరఫు న్యాయవాది నిరంజన్ రెడ్డి కోర్టు దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం ఈ పిటిషన్‌ను సోమవారం విచారిస్తామని చెప్పింది. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా లంచ్ మోషన్ పిటిషన్‌గా స్వీకరించాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరారు. బుధవారం పిటిషన్ దాఖలు చేసి, నెంబర్ అయినా.. కోర్టు సిబ్బంది బిజీగా ఉండడం వల్ల లిస్టులోకి రాకపోయి ఉండొచ్చని వివరించారు. మధ్యాహ్నం 1.30 గంటలకు లంచ్ మోషన్ పిటిషన్ విచారించాలనడం సరైనది కాదని ఈ సందర్భంగా ప్రభుత్వ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. సోమవారం వరకూ ఈ కేసులో ఎలాంటి చర్యలు తీసుకోకుండా పోలీసులను ఆదేశించాలని అల్లు అర్జున్ తరఫు న్యాయవాది నిరంజన్‌రెడ్డి కోర్టును కోరారు. అయితే, పోలీసుల నుంచి వివరాలు సేకరించిన తర్వాతే కోర్టుకు సమాచారం ఇస్తానని ప్రభుత్వ న్యాయవాది.. న్యాయస్థానానికి తెలిపారు. అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్ట్ చేసినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు తెలిపారు. దీంతో న్యాయస్థానం బన్ని పిటిషన్‌పై విచారణను సాయంత్రం 4 గంటలకు వాయిదా వేసింది. ఇదిలావుంటే సినీ నటుడు అల్లు అర్జున్‌పై నమోదైన కేసు మరో మలుపు తిరిగింది. తొక్కిసలాట ఘటనలో మృతిచెందిన రేవతి భర్త భాస్కర్ స్పందించారు. ఈ కేసును విత్ డ్రా చేసుకుంటానని తెలిపారు. అల్లు అర్జున్‌ను విడుదల చేయాలని కోరారు. ఈ ఘటనతో ఆయనకు సంబంధం లేదని పేర్కొన్నారు. 'నా కుమారుడు 'పుష్ప 2' సినిమా చూస్తానంటే సంధ్య థియేటర్‌కు తీసుకెళ్లా. ఇందులో అల్లు అర్జున్ తప్పేం లేదు. ఆయన్ను అరెస్టు చేయనున్నట్టు పోలీసులు నాకు సమాచారం ఇవ్వలేదు. ఆస్పత్రిలో ఉన్న నేను ఫోన్‌లో అరెస్టు వార్త చూశా. కేసు విత్‌డ్రా చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నా' అని భాస్కర్ ఓ వీడియోలో పేర్కొన్నారు.

తెలంగాణ సమాజం

# ఉపాధ్యాయుడిని సన్మానించిన ఎంఈఓ తేజవాత్ వెంకటేశ్వరరావు.

**తెలంగాణ సమాజం వాజేడు ప్రతినిధి.13**


ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రం లోని వాజేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయనిగా విధులు నిర్వహిస్తున్న బొగ్గం కుమార్ బాబును వాజేడు మండల విద్యాధికారి వెంకటేశ్వరరావు సన్మానించారు. ములుగు జిల్లాలో జరిగిన 52వ సైన్స్ ఫెయిర్ లో వాజేడు జిల్లా పరిషత్ పాఠశాల కి చెందిన మహేష్ 'విపత్తు నిర్వహణ' అనే అంశంలో (జూనియర్) విభాగంలో మొదటి బహుమతి గెలుచుకొని రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం జరిగింది.మహేష్ కు గైడ్ టీచరుగా ఉండి ప్రోత్సహించిన కుమార్ బాబును వెంకటేశ్వరరావు పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు, అదేవిధంగా మహేష్ ను అభినందించారు.రాష్ట్ర స్థాయిలో కూడా చక్కగా రాణించి వాజేడు పాఠశాల పేరును రాష్ట్రవ్యాప్తంగా వినిపించేలా చేయాలని వెంకటేశ్వరరావు సూచించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోయం ఆనందరావు, స్వరూప్ సింగ్,రవి, కంచు ప్రభాకర్, రాజ్యలక్ష్మి,రాజేష్, శ్రీరంగం లు పాల్గొన్నారు.



# మహబూబ్ నగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం

## కళ్యాణ లక్ష్మి మరియు షాది ముబారక్ చెక్కుల పంపిణీ !!

**మహబూబ్ నగర్ (తెలంగాణ సమాజం ప్రతినిధి )డిసెంబర్ 13**



మహిళల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తాం అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, స్పష్టం చేశారు. 13/12/2024 రోజు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహబూబ్ నగర్ మరియు హన్వాడ మండలానికి చెందిన 110 మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి మరియు షాది ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. అంతకు ముందు ఆయన మాట్లాడుతూ మహిళల యొక్క ఆశీర్వాదం తోనే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చిందని, అందుకే మహిళల సంక్షేమానికి అభివృద్ధి కి ప్రజా ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం జరిగిందని, ఇప్పటివరకు ఒక కోటి ముప్పై ఒక్క లక్ష ప్రయాణాలను మా ఆడబిడ్డలు చేశారని అన్నారు. అంతే కాకుండా రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేసి రైతులను రుణ విముక్తులను చేశామని, ఇందిరమ్మ ఇండ్లు కూడా మహిళల పేరున మన నియోజకవర్గానికి సుమారు 17 వేల ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని, అధికారులే మీ ఇంటికి వచ్చి సమాచారం సేకరించి, ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన వారి జాబితా చేస్తారని ఆయన స్పష్టం చేశారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇండ్లు పేరుతో దగా చేసిందని ఆయన ఆరోపించారు. ఎవరైనా అధికారులు కానీ మా కార్యకర్తలకు , నాయకులకు కానీ ఒక్క రూపాయి కూడా ఇవ్వరాదని, ఆయన సూచించారు. ఎవరైనా మిమ్మల్ని డబ్బులు అడిగితే మా కార్యాలయంలో తెలియజేయాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, డిసిసి కార్యదర్శి టంకర కృష్ణయ్య యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామకృష్ణ, వెంకటాద్రి, నాయకులు బుద్దారం సుధాకర్ రెడ్డి, పోతన్ పల్లి మోహన్ రెడ్డి, బొట్టు శ్రీను, యాదిరెడ్డి, వేపూరు రఘు, నవనీత, నర్సింహులు, శ్రీనివాస్ యాదవ్, రమేష్ యాదవ్, గోనే శ్రీనివాస్, అబ్దుల్ హక్, మహ్మద్ కలీం, తెలుగు గూడెం ఆంజనేయులు, యాదన్న యాదవ్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ నియోజకవర్గం

## ఫత్తేపూర్..... అంగన్వాడీ విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ పంపిణి

**మహబూబ్ నగర్ (తెలంగాణ సమాజం ప్రతినిధి )డిసెంబర్ 13**

రేపటి భవిష్యత్తు ఈ చిన్నారులదే అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు క్రమశిక్షణ అలవడుతుంది విద్య వ్యవస్థ పైన రాష్ట్ర ప్రభుత్వానికి నిబద్ధత ఉందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, పేర్కొన్నారు. మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని ఫత్తేపూర్ క్లస్టర్ 3లో అంగన్వాడి విద్యార్థులకు శుక్రవారం స్కూల్ యూనిఫామ్స్ ను పంపిణీ చేశారు, అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి చిన్నారులకు పౌష్టిక ఆహారం అందిస్తూ వారికి మంచి ఆరోగ్యాన్ని ఇస్తూ, చిన్నప్పటి నుంచి క్రమశిక్షణతో, విద్యాబుద్ధులు నేర్పిస్తూ అంగన్వాడీ కేంద్రాలు సమాజం లో మంచి పాత్ర పోషిస్తున్నాయని కితాబిచ్చారు. ఈ సంవత్సరం నుంచి అంగన్వాడీ కేంద్రాల్లో చదువుతున్న విద్యార్థులకు యూనిఫామ్స్ కూడా అందిస్తున్నామని అన్నారు. ఈ చిన్నారులే రేపటి దేశ భవిష్యత్తు అని అందుకే భావి నిర్మాత అయిన ఈ చిన్నారుల ను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరి పైన బాధ్యత ఉందని ఆయన స్పష్టం చేశారు. అంతకు ముందు సరస్వతి పూజ నిర్వహించారు. అనంతరం చిన్నారులతో ముచ్చటించారు. వారు చెప్పిన పాటలు ఎమ్మెల్యే గారు ఆసక్తిగా విన్నారు. చిన్నారులను వారి పేర్లను అడిగి తెలుసుకున్నారు. ఏ సమస్యలు ఉన్న నా దృష్టికి తీసుకురావాలని ఐసిడిఎస్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు పండరినాథ్ , భాస్కర్, నరేష్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్ ఎంపిడిఓ కరుణ శ్రీ, తదితరులు పాల్గొన్నారు.



# మహబూబ్ నగర్ పట్టణం

## బిఈడీ కాలేజ్, మెట్టుగడ్డ. బిఈడి కళాశాలలో శౌచాలయాలకు శంకుస్థాపన !!

**మహబూబ్ నగర్ (తెలంగాణ సమాజం ప్రతినిధి )డిసెంబర్ 13**



మంచిగా చదువుకొని మహబూబ్ నగర్ ను ఎద్యుకేషనల్ లో మొదటి స్థానంలో నిలపాలి ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలియజేసిన విద్యార్థులు కళాశాల లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తానని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, పేర్కొన్నారు. మెట్టుగడ్డ లోని బిఈడి కళాశాల ఆవరణలో విద్యార్థుల కోసం నూతనంగా నిర్మిస్తున్న శౌచాలయాలకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈరోజు ఆడబిడ్డలు శౌచాలయ గదులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వారి సమస్యలను అర్థం చేసుకొని మా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అందరం కలిసి వారికి శౌచాలయాలు ఏర్పాటు చేయుటకై నిధులు సమకూర్చి ఈ రోజు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందని, నియోజకవర్గం లోని ఏ పాఠశాల కానీ, కళాశాలలో కానీ ఏ సమస్యలు ఉన్న తన దృష్టికి వస్తే తప్పకుండా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. రాజకీయం అంటేనే సమాజ సేవ చేయడమని ఆనాడే గాంధీ గారు తెలిపారని , గాంధీ వారసులుగా మేము సమాజ సేవ చేస్తున్నామని ఆయన ఉద్ఘాటించారు. మహబూబ్ నగర్ ను ఎద్యుకేషనల్ హబ్ గా మార్చాలనే సంకల్పం తో ఉన్నామని, అందుకు మీ అందరు కూడా చదువులో మంచిగా రాణించి, మహబూబ్ నగర్ ను విద్యలో మొదటి స్థానంలో నిలపాలని ఆయన కోరారు. ఎన్నో సంవత్సరాలుగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకురాగానే వెంటనే పరిష్కరిస్తున్నందుకు విద్యార్థులు ఎమ్మెల్యే గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రోజా తిరుమల వెంకటేష్, గ్రంథాలయ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ , రాష్ట్ర బిసి సంఘం అధ్యక్షులు గోనెల శ్రీనివాస్, జిల్లా మత్స్యకారుల సంఘం అధ్యక్షులు గంజి ఆంజనేయులు, అజ్మత్ అలి , గుండా మనోహర్, శ్రీనివాస్ యాదవ్,శకళాశాల ఇంచార్జీ ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ ముజీబుర్ రహెమాన్, విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# పల్లె నుంచి ప్రపంచ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలి

## - ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**మిర్యాలగూడ తెలంగాణ సమాజం ప్రతినిధి:**

తెలంగాణ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించే లక్ష్యంగా పల్లె నుంచి ప్రపంచ స్థాయి విజేతల కొరకు క్రీడోత్సవాలలో భాగంగా మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ లో నిర్వహిస్తున్న సీఎం కప్ మండల స్థాయి క్రీడోత్సవాలను శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ప్రారంభించారు.అనంతరం క్రీడాకారుతో, విద్యార్థులతో కలసి మాట్లాడి వారితో కబడ్డీ, వాలి బాల్ ఆటలను ఆడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలని ప్రతిభ కలిగిన క్రీడాకారులు కేవలం పల్లెలలో పరిమితమై పోకుండా ప్రపంచ స్థాయికి ఎదగాలి అనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ క్రీడోత్సావాలను నిర్వహిస్తున్నారు అని అన్నారు క్రీడలను విద్యార్థులను , యువకులను శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా బలంగా తయారు చేస్తుందని అన్నారు.క్రీడల వలన ఆరోగ్యంగా కూడా ఉండవచ్చని ప్రతిఒక్కరి క్రీడల్లో ప్రోత్సహించాలని అన్నారు.



# లగచర్ల గిరిజన రైతుకు బేడీలు నిరంకుశత్వానికి నిదర్శనం.

## తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ధీరావత్ శ్రీను నాయక్.

**దామరచర్ల తెలంగాణ సమాజం ప్రతినిధి డిసెంబర్ 13.**



లగచర్లలో ఫార్మా కంపెనీలకు వ్యతిరేకంగా ఉద్యమించిన గిరిజనులు దళితులు పేద రైతులపై అక్రమ కేసులు పెట్టి సంగారెడ్డి సెంట్రల్ జైల్లో ఖైదీలుగా చేసి చిత్రహింసలకు గురిచేయడం వల్లే హీర్యానాయక్ అనే గిరిజన రైతుకు గుండెపోటు వచ్చిందని గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ధీరావత్ శ్రీను నాయక్ ఆరోపించారు. కరుడుగట్టిన ఖైదీలకు బేడీలు వేసినట్టు బేడీలు వేసి ఆసుపత్రికి తీసుకెళ్లడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ధీరావత్ శ్రీను నాయక్ ప్రకటనలో తెలియజేశారు.లగచర్లలో అధికారులపై దాడి చేశారనే పేరుతో రెస్ట్ అరెస్టైన గిరిజన దళిత పేద రైతులను సంగారెడ్డి జైల్లో సైతం చిత్రహింసలకు గురిచేస్తున్నారనాడానికి గిరిజన రైతు హిర్యా నాయక్ సంఘటనే నిదర్శనమని ఆరోపించారు. క్రింది స్థాయి అధికారులే రైతుకు బేడీలు వేశారని అందులో రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదనే సాకుచూపి తప్పించుకోవాలని చూస్తున్నదని అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి తెలియకుండా తన సొంత నియోజకవర్గ రైతులపై కింది స్థాయి పోలీసులు ఇంతటి సాహసానికి పూనుకోరని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తే ఇలాగే ఉంటుందని హెచ్చరించాలనే ఉద్దేశంతోనే గిరిజన రైతు హీర్యా నాయక్ కు బేడీలు వేశారని అన్నారు. లగచర్లలో ఎటువంటి పరిశ్రమలను ఏర్పాటు చేయడం లేదని ఒకవైపు ప్రకటిస్తూనే మరోవైపు అక్కడి గిరిజనులు,దళితులు, పేద రైతులపై పోలీసు నిర్బంధకాండ ఆపకుండా ప్రభుత్వం కొనసాగిస్తోందని ఆరోపించారు. దాడికి ఎటువంటి సంబంధం లేని రైతులను సైతం అరెస్టులు చేస్తూ చిత్రహింసలకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు మద్దతుగా నిలిచిన గిరిజన,ప్రజా సంఘాల నాయకులకు నోటీసులు ఇస్తూ పోలీస్ స్టేషన్లకు రమ్మని వేధిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని చెప్పుకుంటూ ఆచరణలో ప్రజా ఉద్యమాలను భయపెట్టి అణచాలని చూస్తుందని ఆరోపించారు. గత ప్రభుత్వం ఖమ్మంలో రైతులకు బేడీలు వేశారని గగ్గోలు పెట్టిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అటువంటి నిరంకుశత్వాన్ని ప్రదర్శించడం గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా లేదని నిరూపించిందని అన్నారు.లగచర్ల భూ ఉద్యమంలో గిరిజన,దళిత,పేద రైతులపై పెట్టిన అక్రమ కేసులను బేషరతుగా ఎత్తివేయాలి అన్నారు. సంగారెడ్డి సెంట్రల్ జైల్ నుండి తక్షణం విడుదల చేయాలని లేకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి పిలుపునిస్తామని హెచ్చరించారు.

తెలంగాణ సమాజం

# రిపోర్టర్ శ్రీరాములు మృతి తీరనిలోటు-ఆశాదీప్ రెడ్డి

**కల్వకుర్తి తెలంగాణ సమాజం ప్రతినిధి డిసెంబర్ 13**

కల్వకుర్తి వెల్దండ మండలం రాచూర్ గ్రామంలో రిపోర్టర్ శ్రీరాములు లివర్ ప్రాబ్లం తో బాధపడుతూ మరణం చడం జరిగింది. విషయం తెలుసుకొని ఆశాదీప్ రెడ్డి. గ్రామానికి వెల్లి మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. ఆశాదీప్ రెడ్డి మాట్లాడుతూ శ్రీరాములు రిపోర్టర్ మరణం బాధాకరమని ప్రజానీకానికి తీరని లోటు అని ఆశాదీప్ రెడ్డి అన్నారు ఆయన వెంబడి ఐ ఎన్ టి యు సి సెక్రెటరీ తాళ్ల పాండు గౌడు. రిపోర్టర్ బాలయ్య. ఎన్ ఎస్ యు ఐ మండల అధ్యక్షులు కొంక అరవిందు తదితరులు పాల్గొన్నారు.



# ఈనెల 14 న జరిగే టీఎస్ యుఎఫ్ వికారాబాద్ జిల్లా 5వ మహాసభలను విజయవంతం చేయండి

## - చౌడాపూర్ మండల అధ్యక్షప్రధాన కార్యదర్శి శేఖర్, చంద్రశేఖర్ పిలుపు:

**చౌడపూర్( తెలంగాణ సమాజం ప్రతినిధి )13**

ఈనెల 14న పరిగి పట్టణంలోని కేఏఆర్ గార్డెన్‌లో జరిగే టీఎస్ యుఎఫ్ వికారాబాద్ జిల్లా 5వ మహాసభలను విజయవంతం చేయాలని చౌడాపూర్ మండల అధ్యక్షుడు శేఖర్, ప్ర. కార్యదర్శి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ... శనివారం రోజు కెఏఆర్ గార్డెన్‌లో జరిగే ఈ విద్యా సదస్సుకు పరిగి, తాండూర్ ఎమ్మెల్యేలు రాంమోహన్ రెడ్డి , బి మనోహర్ రెడ్డి అతిథులుగా హాజరవుతున్నారని అన్నారు. ఉదయం జరిగే విద్యా వైజ్ఞానిక సదస్సులో వక్తలుగా రాష్ట్ర విద్యాకమిషన్ సలహాదారుడు ఆర్ వెంకట్ రెడ్డి, ప్రముఖ విశ్లేషకులు తిరుపతయ్య తోపాటు టీఎస్ యుటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జంగయ్య, చావా రవి, మాణిక్ రెడ్డి, డీఈవో రేణుకాదేవితో పాటు పలువురు విద్యావేత్తలు, జిల్లా నాయకులు పాల్గొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమానికి మండల వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యాభిమానులు, సామాజికవేత్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.బి. శేఖర్ (అధ్యక్షులు )చంద్రశేఖర్ (ప్రధాన కార్యదర్శి ) టిఎస్ యుటిఎఫ్ చౌడాపూర్ మండల కమిటీ.

# తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేయాలి

## విధులు బహిష్కరించి.రిలే నిరాహార దీక్షలు.

## సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగుల నిరవధిక సమ్మె

**ఖమ్మం తెలంగాణ సమాజం బ్యూరో , డిసెంబర్ 13**

తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్షా అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగుల రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు ఖమ్మం జిల్లా కేంద్రంలో సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు తమ ఉద్యోగ భద్రత కొరకు, హక్కుల కొరకు బుధవారం నుండి విధులు బహిష్కరించి ఖమ్మం జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నాచౌక్ లో మూడు రోజులుగా సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు రెగ్యులరైజేషన్ చేయడం కొరకు నిరవధిక సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, గత ప్రభుత్వం ఇచ్చిన న్యాయమైన హామీలను వెంటనే నెరవేర్చి రెగ్యులర్ చేయాలని కోరారు. ప్రతి ఉద్యోగికి పది లక్షల జీవిత బీమా కల్పించాలని, ఐదు లక్షల ఆరోగ్య బీమా కల్పించాలన్నారు. మహిళలకు 108 రోజులతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలన్నారు. 20 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని, మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు 15 లక్షల ఎక్స్ గ్రేషియా తో పాటు కుటుంబంలో ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగం ఇవ్వాలని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ ఎన్నికల హామీ మేరకు సమగ్ర శిక్షా ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని మా సమస్యలను ప్రభుత్వం పరిష్కారం చేయకపోతే నిరాహార దీక్ష కు వెళ్లే ఆలోచనలో ఉన్నామని తెలిపారు.





# నకిరేకల్ నియోజకవర్గం గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు దైద రవీందర్.

**నకిరేకల్ తెలంగాణ సమాజం ప్రతినిధి డిసెంబర్ 13.**

మనిషి తన మునుగడను కొనసాగించేందుకు గృహం అనేది నిత్యవసరం ప్రాముఖ్యతను సంతరించుకుందని గృహ ఏర్పాటలో మౌలిక సదుపాయాల కల్పన కచ్చితంగా ఉండే విధంగా చూసుకోవాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు దైద రవీందర్ అన్నారు.నకిరేకల్ మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రముఖ వ్యాపారి నారాయణస్వామి గృహప్రవేశం మిల్క్ సెంటర్ ప్రారంభ పూజా కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు దైద రవీందర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం సత్యనారాయణ స్వామి వ్రతం కార్యక్రమంలో దైద రవీందర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే నూతన గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గృహ యజమానులు కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






# మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం మరియు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కు విచ్చేయుచున్న రాష్ట్ర మంత్రివర్యులు

**పరిగి డిసెంబర్ 13 తెలంగాణ సమాజం రిపోర్టర్**

ఎంఎల్ఏ డాక్టర్ టి రామ్ మోహన్ రెడ్డి నివాసంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పత్రిక సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా డిసిసి ఉపాధ్యక్షులు లాల్కృష్ణ మరియు మండల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ ఆదివారం మధ్యాహ్నం రోజు పరిగి మరియు కుల్కచర్ల మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గా ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు శ్రీ తుమ్మల నాగేశ్వరరావు మరియు పంచాయతీరాజ్ శాఖ మాత్యులు ధనసరి అనసూయ సీతక్క మరియు దేవదాయ శాఖ మాత్యులు కొండా సురేఖ మరియు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మరియు పరిగి శాసనసభ్యులు డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి మరియు జిల్లా ఎమ్మెల్యేలు అతిథులుగా విచ్చేస్తున్నారని తెలియజేశారు..పరిగి పట్టణంలో ఐదు కోట్ల రూపాయలతో మునిసిపల్ బిల్డింగ్ శంకుస్థాపన మరియు రెండు కోట్లతో బంజారా భవన్ మరియు 6 కోట్లతో లక్నపూర్ రోడ్ శంకుస్థాపన కార్యక్రమాలు మంత్రులు చేపడతారని తెలిపారు..కావున పరిగి నియోజకవర్గం లోని పరిగి దోమపోడూరు మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు రైతన్నలు పరిగి మార్కెట్ కమిటీ ఆవరణలో జరిగే ఈ కార్యక్రమానికి అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయగలరని తెలియజేశారు...ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ సభ్యులు వైస్ చైర్మన్ ఆయూబ్, మరియు డైరెక్టర్లు మరియు యాదవ రెడ్డి, చిన్న నరసింహులు, అనెం ఆంజనేయులు, ప్రభాకర్ రెడ్డి, రామ కృష్ణ, రాజ పుల్లా రెడ్డి, శాంత కుమార్, మాధవ్ రెడ్డి, కృష్ణ రెడ్డి, గోపాల్, ఆనంద్, %ఎం% యేజాజ్, గణిమోని శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



# దోమ మండల మాజీ వైస్ ఎంపీపి, జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ యాదయ్య గౌడ్

## - కుటుంబ సభ్యులను పరామర్శించిన తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి...

**దోమ డిసెంబర్ 13 తెలంగాణ సమాజం రిపోర్టర్**

దోమ మండల మాజీ వైస్ ఎంపీపీ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ బంగ్ల యాదయ్య గౌడ్,సీనియర్ జర్నలిస్ట్ బంగ్లా వెంకటయ్య గౌడ్ తల్లి అనసూజా ఇటీవలే అనారోగ్యంతో మరణించడం జరిగింది. శుక్రవారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ..పరామర్శించారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య,మాజీ ఎంపిపి రాజగోపాల చారి, కుల్కచర్ల పిఏసీఎస్ చేర్మెన్ కనకం మొగులయ్య,మాజీ ఎంపిటిసి రాంలాల్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి,బల్ల వెంకటేష్,నరేందర్ రెడ్డి, కావటి శ్రీనివాస్, కుమార్ గౌడ్,సురేష్ గౌడ్,యాదయ్య గౌడ్, సంజీవ్,వెంకటేష్, నారాయణ,తెలుగు హనుమంతు,శ్రీనివాస్ యాదవ్, నీలి వెంకటయ్య, బెస్త లక్ష్మణ్, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు...



# సీఎం కప్ బాక్సింగ్ పోటీలకు ఎంపిక

**(భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ సమాజం జిల్లా బ్యూరో)**



సీఎం కప్ కు బాక్సింగ్ జట్టు ఎంపికలు ఈనెల 16న ప్రగతి మైదానం లో ఎనిమిది గంటల 30 నిమిషాలకు హాజరు కావలెను భద్రాద్రి కొత్తగూడెం డిస్టిక్ సెక్రెటరీ మట్టపర్తి రమేష్ ఓ ప్రకటనలు తెలిపారు అనంతరం ఆయన మాట్లాడుతూసబ్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ సీనియర్ మెన్ ఈ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులు 27 నుండి జనవరి 2 వరకు ఎల్బీ స్టేడియంలో స్టేట్ మీట్ జరగబడును ఆసక్తిగల అభ్యర్థులు 8 గంటలకు చేరుకోవలెను అన్నారు వివరముల కొరకు ఆర్గనైజింగ్ సెక్రెటరీ మరియు హెడ్ కోచ్ సత్యబాబు ఫోన్ నెంబర్ 9299903203 కోచ్ శ్రీనివాసు ఫోన్ నెంబర్8039378886 ఫోన్ చేసి సంప్రదించవలెను ఈ సెలెక్షన్స్ జిల్లా క్రీడల అధికారి పరంధామ రెడ్డి గారి ఆధ్వర్యం లో నిర్వహించటం జరుగుతుందని తెలిపారు

# బాలికలకు మెరుగైన విద్య అందించడమే లక్ష్యం

## కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాల నూతన భవన శంకుస్థాపన కార్యక్రమం లో ఎమ్మెల్యే బత్తుల

**మిర్యాలగూడ తెలంగాణ సమాజం ప్రతినిధి:**

మిర్యాలగూడ మండలం అలగడప గ్రామంలో నూతనంగా 3.25 కోట్లతో మంజూరు చేసిన కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాల నూతన భవనానికి మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పేద మధ్యతరగతి బాలికలకు మెరుగైన ఉన్నత విద్యలను అందించాలని లక్ష్యంతో ఇంటర్మీడియట్ కళాశాల భవన నిర్మాణం చేయడం జరుగుతుంది అని అన్నారు.ప్రభుత్వం పేద మధ్యతరగతి, విద్యార్థులకు మెరుగైన వసతులతో కూడిన విద్యను అందించేందుకు కస్తూర్బా,మోడల్ స్కూల్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో 40 శాతం డైట్,కాస్మొటిక్ చార్జీలను పెంచి వారికి అండగా ఉందని అన్నారు ఆడబిడ్డ చదువు కేవలం ఒక ఇంటికి మాత్రమే కాదు, మొత్తం సమాజాన్ని ప్రభావితం చేస్తుంది అని అన్నారు కావున బాలికలు అందరూ మంచిగా చదువుకొని విద్యలో రాణించాలని మీకు ఎలాంటి అవసరాలు ఉన్నా నేను అండగా ఉంటా అని అన్నారు. కళాశాల భవనాన్ని త్వరగా పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం వరకు ఇంటర్మీడియట్ క్లాసులు ప్రారంభించాలని అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ,ఎంఈవో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు..



# 10 వ వార్డులో ఇందిర మ్మ ఇల్లుల సర్వేను ప్రారంభించిన కౌన్సిలర్ మునిగడప పద్మ

**(భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ సమాజం జిల్లా బ్యూరో). ..**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 6 గ్యారంటీల్లో భాగంగా ప్రజా పాలనలో తీసుకున్న దరఖాస్తుల ప్రకారం ఈరోజు ఇందిరమ్మ ఇల్లుల సర్వేను ప్రభుత్వం చేపట్టింది .ఆ సర్వేను పదో వార్డు కౌన్సిలర్ మునిగడప పద్మ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ సర్వే డిసెంబర్ నెల ఆఖరి వరకు నియమించబడిన అధికారులు ఇంటింటికి తిరిగి వారి వివరాలు తీసుకొని ఆన్లైన్లో నమోదు చేస్తారని తెలిపారు . అర్హులుగా గుర్తించి వారిని గ్రామసభల ద్వారా, సంవత్సరానికి కొంతమంది చొప్పున దశలవారీగా ఇందిరమ్మ ఇల్లులను మంజూరు చేస్తారని ఆమె తెలిపారు .ఈరోజు మొదటి రోజున ఆన్లైన్ యాప్ లో వచ్చిన సాంకేతిక కారణాలవల్ల సర్వే మందకొడిగా సాగుతుందని, సాంకేతిక లోపాన్ని సవరణ చేసుకొని అధికారులు త్వరితగతిన అర్హులైన లబ్ధిదారుల జాబితాను ప్రకటిస్తారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వే ఆఫీసర్ ఎన్ రవి, అసిస్టెంట్ శ్రీ రామ్మూర్తి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



telanganasamajam.com
తెలంగాణ సమాజం
తెలుగు దినపత్రిక

# సంక్రాంతి నాటికి ఇందిరమ్మ ఇంటి నిర్మాణ నమూనా

# పూర్తి రాష్ట్రంలో 580 ఇందిరమ్మ ఇళ్ల మోడల్ హౌస్ నిర్మిస్తున్నాం





**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపురోగతి వివరాలు యాప్ లో నమోదు**

**డిసెంబర్.చివరివరకుఇందిరమ్మఇళ్లదరఖాస్తుదార ుల వివరాల సేకరణ పూర్తి రాబోయే 4సంవత్సరాలలో20లక్షల ఇందిరమ్మఇండ్లునిర్మించడమేక్ష్యం కూసుమంచి పర్యటనలో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం,సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

కూసుమంచి :రాబోయే సంక్రాంతి నాటికి కూసుమంచి మండలంలో మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తి అవుతుందని తెలంగాణ రెవెన్యూ , గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ తో కలిసి కూసుమంచి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రూ. 5 లక్షల రూపాయల అంచనా విలువతో చేపట్టనున్న ఇందిరమ్మ ఇళ్లు మోడల్ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం గడిచిన నేపథ్యంలో ప్రతి జిల్లా హెడ్ క్వార్టర్, రాజధాని హైదరాబాద్ లో ఘనంగా ఉత్సవాలు జరుపుకున్నామని,ఇందులో భాగంగా రాబోయే నాలుగు సంవత్సరాలలో పేదవాడి సొంతింటి కల నెరవేర్చే దిశగా ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమం నెరవేర్చేందుకు డిసెంబర్ 5న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగాయాప్.ప్రారంభించుకున్నామని అన్నారు. ప్రభుత్వం ఏర్పడగానే చేపట్టిన ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 80 లక్షల మంది ఇందిరమ్మ ఇండ్ల పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారని, వీటిలో అర్హులైన దరఖాస్తులను ఎంపిక చేసి మొదటి విడత ప్రభుత్వం మంజూరు చేసే నాలుగున్నర లక్షల ఇండ్ల క్రింద ఎంపిక చేయడం జరుగుతుందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల యాప్ ద్వారా పేదలు ప్రస్తుతం నివసించే గుడిసె, షెడ్డు, టార్పాలిన్ కవర్ ఇళ్లు ఫోటో తీసుకొని వివరాలు నమోదు చేయడం జరుగుతుందని, యాప్ లో నమోదు చేసిన వివరాల ప్రకారం బహు పేదలను ఎంపిక చేసి మొదటి విడత లబ్ధి చేకూరుస్తామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల క్రింద సొంత ఇంటి స్థలం ఉన్నవారికి 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం 4 విడతలలో అందుతుందని, ఫౌండేషన్ వేసిన తర్వాత లక్ష రూపాయలు, కిటికిల స్థాయికి చేరగానే లక్షా పాతిక వేలు, స్లాబ్ దశ చేరిన తర్వాత లక్ష 75 వేల రూపాయలు, ఇండ్లు పూర్తి చేసిన తర్వాత మరో లక్ష రూపాయల సహాయం అందుతుందని, ప్రతి దశలో ఇంటి నిర్మాణ పురోగతి వివరాలు ఇందిరమ్మ ఇండ్ల యాప్ లో నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం నమూనాల నిర్మాణం కోసం మొదట డోర్నకల్ నియోజకవర్గంలోని ఎంపీడీవో కార్యాలయంలో శంకుస్థాపన చేయడం జరిగిందని, కూసుమంచి మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మరో నమూనా ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశామని అన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని మండల కేంద్రాల్లో ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌస్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 580 ఇందిరమ్మ మోడల్ హౌస్ ఇండ్లు నిర్మిస్తామని అన్నారు. సంక్రాంతి నాటికి కూసుమంచి మండల కేంద్రంలోని మోడల్ హౌస్ నిర్మాణం పూర్తవుతుందని అన్నారు.మోడల్ హౌస్ ను పరిశీలించి తక్కువ ధరతో నాణ్యతతో ఇల్లు ఎలా కట్టాలో పేదలు పరిశీలించి వారి స్థలాలలో నిర్మించుకోవాలని మంత్రి సూచించారు. ఇంటిలో నివసించే ప్రజలే నిర్మాణం చేసుకునేలా ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని,3 లక్షలకు పైగా ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల వివరాలుసేకరణ జరిగిందని, డిసెంబర్ చివరి వరకు ప్రతి దరఖాస్తుదారుని వివరాలు సేకరణ పూర్తవుతుందని అన్నారు.గతంలో దరఖాస్తు చేసుకొనని కుటుంబాలు ఉంటే ప్రజాపాలన సేవా కేంద్రాలలో దరఖాస్తు సమర్పించవచ్చని, గతంలో దరఖాస్తు చేసుకున్న వారు మరణిస్తే, ఆ కుటుంబ సభ్యులు దరఖాస్తు సమర్పించాలని మంత్రి తెలిపారు. వివిధ కారణాలు చూపి ప్రజలకు ఇండ్లు ఎగ్గొట్టే ఉద్దేశం ప్రజా ప్రభుత్వానికి లేదని, రాబోయే 4 సంవత్సరాలలో 20 లక్షల ఇండ్లు తగ్గకుండా నిర్మించాలని ఇందిరమ్మ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సామాగ్రి ఎటువంటి ఇబ్బంది రాకుండా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. పేదవాడి చిరకాల కోరిక సొంతింటి కలను నెరవేర్చే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుంటుందని మంత్రి అన్నారు.జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ.ఇందిరమ్మ ఇండ్ల డెమో యూనిట్ నిర్మిస్తున్నందున చాలా సంతోషంగా ఉందని అన్నారు. ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ ద్వారా 3 లక్షల 57 వేల 869 మంది ఇందిరమ్మ ఇండ్ల కోసం అర్జీలు పెట్టుకున్నారని, 16 శాతం మేర ఈ దరఖాస్తుల స్క్రూటినీ పూర్తయిందని,మంత్రి ఆదేశం మేరకు డిసెంబర్ నెలాఖరు వరకు ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన పూర్తవుతుందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా జరగాలని మంత్రి ఆదేశించారని, క్షేత్రస్థాయిలో వాస్తవిక పరిస్థితులను గమనించి నిరుపేదలైన అర్హులకు మొదటి విడతలో ఇండ్లు మంజూరు చేస్తామని అన్నారు.నెల రోజుల వ్యవధిలో ఇందిరమ్మ ఇండ్ల డెమో యూనిట్ నిర్మాణం పూర్తి చేస్తామని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల నమూనా నిర్మాణం దగ్గర మేస్త్రీ లకు వర్క్ షాప్ పెట్టి నాణ్యమైన ఇండ్ల నిర్మాణంపై శిక్షణ అందించేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో వర్గాలు, కులాలు, మతాలకతీతంగా ప్రతి ఒక్కరికి సొంత ఇళ్ళు ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రారంభించిన ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు నిర్విరామంగా కృషి చేస్తారని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్లు సీతారాములు, హరినాథ బాబు,ముదిరాజ్ నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, మండల ప్రత్యేక అధికారిణి శ్రీలత, హౌజింగ్ ఇఇ శ్రీనివాసరావు, పీఆర్ ఈఈ వెంకట్ రెడ్డి, కూసుమంచి మండల ఇన్ చార్జ్ తహసీల్దార్ కరుణశ్రీ, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక పరిస్థితి బాగుచేస్తూ ప్రతి హామీ అమలుకు కృషి

**రాష్ట్ర రెవెన్యూ,శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఖమ్మంరూరల్,తిరుమలాయపాలెం మండలాల్లోపలు**

**సీసీ రోడ్డు నిర్మాణ పనులకు,సైన్స్ల్యాబ్.కుశంకుస్థాపన, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన మంత్రి పొంగులేటి**





**ఖమ్మం తెలంగాణ సమాజం బ్యూరో, డిసెంబర్ 13:**

ఖమ్మంరాష్ట్రంలో గత ప్రభుత్వం సృష్టించిన ఆర్థిక విధ్వంసం నుంచి ఆర్థిక పరిస్థితులను బాగు చేస్తూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీ అమలు దిశగా కృషి చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.శుక్రవారం మంత్రి, ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం మండలాల్లో పర్యటించి పలు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, సైన్స్ ల్యాబ్ కు శంకుస్థాపనలు, తిరుమలాయపాలెం మండలం లబ్దిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.ఖమ్మం రూరల్ మండలంలో మొదట ఉదయం పర్యటించి కొండాపురం గ్రామంలో 18.5 లక్షలతో, గొల్ల గూడెం గ్రామంలో 20 లక్షలతో, ఏదులాపురం గ్రామంలో 48 లక్షలతో, ఏదులాపురం గ్రామ పంచాయతీ లో 20.50 లక్షలతో, పెద్ద తండ గ్రామ పంచాయితీలో 49 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మధ్యాహ్నం తిరుమలాయ పాలెం మండలంలో పర్యటించి కొక్కిరేణి గ్రామంలో పిఎంశ్రీ నిధులు 13.5 లక్షలతో ఏర్పాటు చేయనున్న సైన్స్ ల్యాబ్ కు, 30 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, తిరుమలాయ పాలెం మండలానికి చెందిన 54 మందికి ఒక్కొక్కరికి ఒక లక్షా 116 రూపాయల చొప్పున లబ్దిదారులకు మొత్తం 54 లక్షల 6 వేల 264 రూపాయల కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. అనంతరం బీరోలు గ్రామంలో 30 లక్షలతో, బచ్చోడు తండాలో 20 లక్షలతో,బచ్చోడు గ్రామంలో 30 లక్షలతో, హుస్నాబాద్ గ్రామంలో 25 లక్షలతో, సుబ్లేడు గ్రామంలో 30.50 లక్షలతో, పాతర్లపాడు గ్రామంలో 30 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఒక్కొక్క హామీని క్రమ పద్ధతిలో అమలు చేస్తున్నామని అన్నారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 21 వేల కోట్ల రైతుల రుణ మాఫీ చేశామని, సన్న వడ్లకు క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ ఇస్తున్నామని, తరుగు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని అన్నారు. ప్రతి నెల గత ప్రభుత్వం చేసిన అప్పుల దృష్ట్యా 6500 కోట్లు వడ్డీ, అసలు చెల్లింపుకు ఖర్చు అవుతుందని అన్నారు. కూసుమంచి మండలంలో ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌస్ నిర్మాణానికి ఈరోజు శంకుస్థాపన చేశామని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు వచ్చేలా చూస్తామని, బహు పేదలకు మొదటి విడతలో ఇండ్లు అందిస్తామని అన్నారు.గతంలో ఇందిరమ్మ రాజ్యంలోనే ఇందిరమ్మ ఇండ్లు అందించామని, ప్రస్తుతం కూడా అర్హులకు ఇల్లు అందించేందుకు చర్యలు తీసుకున్నామని, ప్రజాపాలన క్రింద ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఇంటికి అధికారులు వచ్చి ఫోటో తీసుకొని అర్హుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని అన్నారు. అర్హులకు తెల్ల రేషన్ కార్డు జారీ ప్రక్రియత్వరలోప్రారంభమవుతుందని అన్నారు. నూతన పెన్షన్లు కూడా అర్హులకు అందించేందుకు చర్యలు చేపడతామని, ఒక రోజు వెనకా, ముందు అయినా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఆర్ అండ్ బి ఎస్ఇ హేమలత, పీఆర్ ఇఇ వెంకట్ రెడ్డి, వ్యవసాయ శాఖ ఏడి సరిత, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన మాజీ సర్పంచ్ జిల్లెల్ల రాములు

**నాగర్ కర్నూల్ తెలంగాణ సమాజం ప్రతినిధి డిసెంబర్ 13**

కల్వకుర్తి మండలం జిల్లెల్ల గ్రామంలో నివాసం ఉంటున్న బొందల అలివేల ఆకస్మాతుగా మృతి చెందింది .మృతి విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ జిల్లెల్ల రాములు మృతురాలి కుటుంబాన్ని పరమార్శించి, గ్రామ నాయకుల ద్వారా మృతురాలి కూతురు శిరీష కు 3000 రూపాయల ఆర్థిక సహాయం అందించారు.మృతురాలి కుటుంబానికి అన్నివిధాలా అందుబాటులో ఉంటామని, అన్ని విధాలుగా ఆధుకుంటామని భరోసా ఇచ్చారు .ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముచర్ల శ్రీకాంత్ రెడ్డి,దేవాలయ చైర్మెన్ కొమ్మగోని రవిగౌడ్, నాయకులు పెరుమాల్ల శ్రీశైలం,కుర్వ సంఘం అధ్యక్షుడు చిక్కొండబీరయ్య,డొక్కా జంగయ్య,డొక్కా బాల్ రాజ్,డొక్కా రమేష్,డొక్కా బాలస్వామి,గుమ్మకొండ వెంకటయ్య, గుమ్మకొండ ఎట్టయ్య, పెరుమాల్ల ఆంజనేయులు, తోటపల్లి నర్సింహా,డొక్కా శ్రీశైలం, గణేష్, మహేష్, మొక్తాల రాములు తదితరులు పాల్గొన్నారు.



# నిబంధనలకు విరుద్ధంగా గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ను కిరాయి కి వాడకం

## - వడ్ల లోడుతో మిల్లుకి వెళ్తున్న వాహనం.



గత ప్రభుత్వంలో ఊరికి ఒక ట్రాక్టర్ ను ప్రభుత్వ సొమ్ముతో ఊరి కోసం వాడాల్సి విషయం అందరికీ విదితమే కాగా పుట్టల గడ్డ గ్రామపంచాయతీలో మాత్రం అందుకు విరుద్ధంగా కిరాయికి తిప్పుతున్న ఘటన వెలుగులోకి వచ్చింది.స్థానిక మాజీ సర్పంచ్ భాషా నాయక్ అందించిన వివరాల ప్రకారం దామరచర్ల మండలం పుట్టలగడ్డ గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్ ని గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్ రూపావత్ సోము పంచాయతీ కార్యదర్శి లావూరి కృష్ణ తమ స్వంత పనులకు వడ్లకు కిరాయికి తిప్పుతున్నారని మాజీ సర్పంచ్ రూపావత్ బాష్యా నాయక్ శుక్రవారం ఆరోపించారు.పారిశుద్ధ్య పనుల కోసం వాడాల్సిన ట్రాక్టర్ ని వడ్ల లోడు వేసుకొని బొంగ్రం కట్టి బయటి వ్యక్తుల పనుల కోసం మిర్యాలగూడకి ఇతర చోట్లకి కిరాయికి తిప్పుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వాహనం వాడుతున్న వారిపై అందుకు సహకరించిన అధికారులపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని భాషా నాయక్ డిమాండ్ చేశారు.

# ఇందిరమ్మ ఇంటి సర్వేకు ప్రజలు సహకరించాలి బడేపల్లి నరేష్

**దోమ డిసెంబర్ 13 తెలంగాణ సమాజం రిపోర్టర్**



రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలలో ముఖ్యమైన పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చునుంది అందులో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేలు ప్రజలు. అధికారులకు సహకరించాలని బడెంపల్లి నరేష్ శుక్రవారం ఒక ప్రకటనలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈరోజు నుండి ఇందిరమ్మ ఇళ్ల సర్వే జరుగుతుందని మీ ఇంటి స్థలం కాగితాలు ఇంటి పన్నుల బకాయలు లేకుండా రసీదులు మీ దగ్గర ఉంచుకోవాలని ఇందిరమ్మ సర్వే కు వచ్చిన వారికి సహకరించాలని కోరారు. ఆయా గ్రామ పంచాయతీలోని కాంగ్రెస్ బూత్ కమిటీ సభ్యులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పేదవారికి సహకరించి వారికి అవగాహన కల్పించాలని నిరుపేదలకు అండగా నిలిచి ప్రభుత్వ సంకల్పాన్ని సద్వినియోగం చేసేందుకు కృషి చేయాలని కోరారు

# మాదారం గ్రామంలో గోవింద మాంబ సమేత

## వీరబ్రహ్మేంద్ర విగ్రహ ప్రతిష్టాపన మాదారం శ్రీనివాస్

**పరిగి డిసెంబర్ 13 తెలంగాణ సమాజం రిపోర్టర్**

వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ ప్రతిష్టాపన కార్యక్రమాలలో పాల్గొన్న మాజీ ఎంపీపీ కరణం అరవింద రావు బిఆర్ఎస్ పరిగి మండల పార్టీ మండల అధ్యక్షులు ఆర్ ఆంజనేయులు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి మిట్టకోడూర్ మాజీ ఎంపిటిసి మాణిక్యం మాదారం మాజీ సర్పంచ్ రాములు , ఈశ్వరప్ప , రాందాస్ , శ్రీనివాస్ చారి



# స్కూళ్లను సందర్శించిన ఎంఈఓ వెంకట్

దోమ డిసెంబర్ 13 తెలంగాణ సమాజం రిపోర్టర్

దోమ మండల పరిధిలోని బుద్లాలపూర్ వెంకట్ ఎం ఈ ఓ సందర్శించడం జరిగింది పాఠశాల తరగతి గదులను పరిసరాలను పలు రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులకు తెలుగు ఇంగ్లీష్ గణితం కు సంబంధించిన పలు సామర్థ్యాలను విద్యార్థులచే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సత్యనారాయణ సార్ ఉపాధ్యాయులు లక్ష్మణ్ సార్, సువర్ణ మేడం, భీంల సార్,మధు సార్ పాల్గొనడం జరిగింది.



# పారా త్రో బాల్ గోల్డ్ మెడల్ భాగ్యకు సన్మానం

తెలంగాణ సమాజం (గూడూరు ప్రతినిధి) డిసెంబర్ 13

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో గొల్లగూడానికి చెందిన భాగ్య కు కొద్ది రోజుల క్రితం కంబోడియాలో 6 దేశాల మధ్య పారా త్రోబాల్ (నేపాల్- మలేషియా- భూటాన్ -ఇండోనేషియా-కాంబోడియా-ఇండియా) జాతీయ స్థాయి పోటీలలో మన దేశం నుండి దయ్యాల భాగ్య పాల్గొని గోల్డ్ మెడల్ సాధించడం జరిగింది భాగ్యకు కృతజ్ఞతలు తెలియజేస్తూ సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ రేగ రమేష్. పి ఈ టి కొట్టెం నాగేష్ అరవింద విద్యాలయం పి ఈ టీ కొయ్యడ సారంగపాణి కాంగ్రెస్ నాయకులు మండల ఉపేందర్ రాస మల్ల రాములు మటన్ కుమార్ డోలాగర్ నాగేశ్వర్ తేజావత్ లాల్ సింగ్ పాల్గొన్నారు.



# ఆర్మీ జవాన్ భౌతిక కాయానికి అశ్రు నివాళులు అర్పించిన గూడూరు గ్రామ ప్రజలు

తెలంగాణ సమాజం (గూడూరు ప్రతినిధి) డిసెంబర్ 13

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో ఆర్మీ జవాన్ కోమటిపెల్లి తండా గ్రామవాసి గుగులోతు రమేష్ నాయక్ ఆర్మీ జవాన్ చత్తిశ్ గడ్ సరిహద్దుల్లో విధి నిర్వహణంలో హటత్మ నరణం చెందగా జవాన్ భౌతిక కాయానికి పూలమాలలు వేసి ఘన అశ్రు నివాళి అర్పించారు ఈ కార్యక్రమంలో గూడూరు గ్రామ ప్రజలు మరియు గూడూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కత్తి స్వామి గూడూరు మాజీ ఎంపీపీ సర్పంచ్ నునావత్ రమేష్ నాయక్ జిల్లా మాజీ జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ ఖాసిం వారి తోపాటు మండల సీనియర్ నాయకులు కన్నబోయిన వెంకన్న ఎండి ఖదీర్ భూపతి పేట మాజీ సర్పంచ్ ఆవుల అశోక్ వేగంపేట మాజీ సర్పంచి విష్ణు పెద్దకాసు కుమారస్వామి మాజీ వార్డు సభ్యుడు హెచ్ శివ మాజీ సిటి యూత్ ప్రెసిడెంట్ మండల మల్లేష్ దోమ సతీష్ ఇనుముల శీను గొడుగు మునేష్ మహమ్మద్ రహీం చాంద్ పాషా వాడిక వెంకన్న తదితరులు పాల్గొన్నారు.







# ఓటర్ జాబితా సవరణపారదర్శకంగా చేపట్టాలి.






**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి**

**అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి**

**ఓటరుజాబితానుంచిపేరుతొలగించే సమయంలోనిబంధనలనుపాటించాలి ఓటర్ సవరణ జాబితా 2025 పై జిల్లా కలెక్టర్ తోకలిసిసంబంధిత అధికారులతో సమీక్షించిన సీఈఓ**

ఖమ్మం, తెలంగాణ సమాజం బ్యూరో డిసెంబర్-13:

ఖమ్మం.ఓటర్ జాబితా సవరణ కార్యక్రమాన్ని అధికారులు పారదర్శకంగా నిర్వహించాలని, ప్రతి దశలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్నారు.శుక్రవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో ఓటర్ సవరణ జాబితా 2025 పై తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఖమ్మం జిల్లాలో ఓటర్ సవరణ జాబితా 2025, వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ జాబితా నమోదుపై జిల్లాలో చేపడుతున్న చర్యలను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ,లి ఓటర్ జాబితాలో ఉన్న తప్పు ఒప్పులను బాగు చేసేందుకు ఓటర్ సవరణ జాబితా ఒక మంచి అవకాశమని, ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహిస్తే ఓటర్ జాబితా సవరణ విజయవంతంగా పూర్తి చేయగలమని అధికారులకు సూచించారు.ఓటర్ జాబితా సవరణ 2025 పూర్తి పారదర్శకంగా జరగాలని, ప్రతి కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని అన్నారు. ఓటరు నమోదు కార్యక్రమానికి సంబంధించి స్పెషల్ క్యాంపెయిన్ వివరాలను ఆయన ఆరా తీశారు. ఓటర్ జాబితా నుంచి ఒక ఓటు తీసే సమయంలో ఎందుకు తీసేస్తున్నామో స్పష్టమైన సమాచారం, కారణాలు మనకు ఉండాలని అన్నారు.డ్రాఫ్ట్ ఓటర్ జాబితా విడుదల చేసిన తర్వాత నూతనంగా ఎంతమంది ఓటర్లు నమోదు అవుతున్నారు వంటి వివరాలను తెలుసుకున్నారు. ఓటర్ జాబితాలో నూతనంగా నమోదవుతున్న వారి వివరాలను ర్యాండంగా చెక్ చేయాలని అధికారులకు ఆయన సూచించారు. ఓటర్ జాబితాకు సంబంధించి వచ్చిన ప్రతి అభ్యంతరాలు, క్లెయిమ్ పూర్తి స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు.పోలింగ్ కేంద్రాల తనిఖీ చేసి, ఎక్కడైనా నూతనంగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందా, పేర్లు మార్చాల్సిన పోలింగ్ కేంద్రాలు, తదితర అంశాల పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సంప్రదించి ప్రతిపాదనలు అందించాలని అన్నారు. ఒకటే అడ్రెస్ లో వంద మంది ఓటర్లు ఉండటం వంటి కేసులను నిశితంగా పరిశీలించాలని అన్నారు.వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ కి సంబంధించి వచ్చిన ప్రతి క్లెయిమ్,అభ్యంతరం నిబంధన ప్రకారం పరిష్కరించి ఓటర్ జాబితా పక్కాగా తయారు చేయాలని అన్నారు.జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో 5 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని, వీటికి సంబంధించి మొత్తం 12 లక్షల 27 వేల 230 ఓటర్లతో డ్రాఫ్ట్ ఓటర్ జాబితా తయారు చేశామని, జిల్లాలో జనాభా ఓటర్ల నిష్పత్తి 693, మహిళలు పురుషుల నిష్పత్తి 1075 గా ఉందని, జిల్లాలో నూతనంగా ఐదు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించామని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 27 వేల 287 మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నారని, నవంబర్ లో నిర్వహించిన స్పెషల్ క్యాంపెయిన్ రోజులలో జిల్లాలో మొత్తం 1181 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటర్ జాబితా పై వచ్చిన 21 వేల 277 దరఖాస్తులలో ఇప్పటివరకు 18 వేల 97 పరిష్కరించామని కలెక్టర్ తెలిపారు. ఉమ్మడి వరంగల్ ఖమ్మం నల్గొండ జిల్లాలో ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల జాబితా నవంబర్ 23న ప్రకటించామని, జిల్లాలో ఇప్పటివరకు 4605 నూతన ఓటర్ల నమోదు దరఖాస్తులు వచ్చాయని , వీటిలో 3899 ఆమోదించి, 542 తిరస్కరించామని, 163 దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని వీటిని పరిష్కరించి డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తామని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ,జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసిల్దార్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

## సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావిస్తా కూనంనేని

ఖమ్మం తెలంగాణ సమాజం బ్యూరో డిసెంబర్ 13



ఖమ్మం విద్యాశాఖలో సమగ్ర శిక్షా అభియాన్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం అంగీకరించిన న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి జాప్యమెందుకని ఆయన ప్రశ్నించారు. కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సిఆర్పి ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులకు కూనంనేని సాంబశివరావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మహిళా ఉపాధ్యాయులకు -వర్తించే అన్ని సెలవులను కస్తూర్బా బాలికల విద్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులకు వర్తింపజేయాలని బోధన, బోధనేతర సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.ఉద్యోగులు వారం రోజులుగా నిరవధిక దీక్ష చేస్తున్న ప్రభుత్వం స్పందించక పోవడం శోచనీయమన్నారు.ఉద్యోగులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కూనంనేని సూచించారు సమగ్ర శిక్షా అభియాన్,కస్తూర్బా బాలిక విద్యాలయాల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలపై శాసనసభలో ప్రస్తావిస్తానని ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని సాంబశివరావు హామీ ఇచ్చారు. సమగ్ర శిక్షా అభియాన్, కస్తూర్బా ఉద్యోగులు చేస్తున్న ఆందోళనకు మాజీ ఎంఎల్సి పూల రవీందర్, పిఆర్టియు నాయకులు యలమద్ది -వెంకటేశ్వరరావు (వైవి) మద్దతు పలికారు. వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య,ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు,యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగమల్లేశ్వరరావు,కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్ 14న కామన్ డైట్ లాంచ్ కార్యక్రమం

**బోనకల్ బీసీరెసిడెన్షియల్.పాఠశాల విద్యార్థులతోకలిసిసహపంక్తిభోజనం చేయనున్న ఉప ముఖ్యమంత్రి తిరుమలాయపాలెం మండలం మాదిరిపురంగ్రామంలోనిగిరిజన రెసిడెన్షియల్.హాస్టల్లోహాజరుకానున్న రెవెన్యూ శాఖ మంత్రి పిల్లల తల్లిదండ్రులు కామన్ డైట్ లాంచ్ కార్యక్రమానికి హాజరు కావాలి పౌష్టికరమైనరుచికరమైనఆహారాన్ని విద్యార్థులకు అందించేందుకు 40 శాతం పెరిగిన డైట్ చార్జీలు**

ఖమ్మం తెలంగాణ సమాజం బ్యూరో, డిసెంబర్ 13:

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో డిసెంబర్ 14న నిర్వహించు కామన్ మెనూ లాంచ్ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లు పాల్గొంటారు.ఉప ముఖ్యమంత్రి పర్యటనలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఖమ్మం రెవెన్యూ డివిజన్ అధికారి, రెవెన్యూ శాఖ మంత్రి పర్యటనలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ రమేష్ లు పాల్గొంటారు.డిసెంబర్ 14న ఉదయం 11 గంటలకు ఉప ముఖ్యమంత్రి బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామానికి చేరుకొని నరేగా పథకం క్రింద నిర్మించిన రోడ్లను ప్రారంభించిన అనంతరం 11-40 నుండి 2-20 వరకు బోనకల్ లోని బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలో జరిగే కామన్ డైట్ లాంచ్ కార్యక్రమంలో పాల్గొంటారు.అనంతరం మధ్యాహ్నం 2-30 నుండి సాయంత్రం 7 గంటల వరకు శాంతి నిలయం, రావినూతుల, గోవిందాపురం, జానకిపురం, రాపల్లి, రొంపిమల్లి గ్రామాలలో పర్యటించి ఉప ముఖ్యమంత్రి నరేగా క్రింద నిర్మించే రోడ్లు, గ్రామ పంచాయతీ, అంగన్వాడి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, రాత్రి మధిరలో అధికారులను కలిసి నైట్ హాల్ట్ చేస్తారు.డిసెంబర్ 14న ఉదయం 10-45 గంటలకు కూసుమంచి మండలం నాయకన్ గూడెంలో సీసీ రోడ్లు, డ్రైన్ ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఉదయం 11-30 నుండి మధ్యహ్నం ఒంటి గంట వరకు తిరుమలాయపాలెం మండలం మాదిరిపురం గ్రామంలోని గిరిజనుల రెసిడెన్షియల్ పాఠశాలలో జరిగే కామన్ డైట్ లాంచ్ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరు అవుతారు. అనంతరం అక్కడ నిర్మిస్తున్న గిరిజన హాస్టల్ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తారు.గతంలో ఉన్న డైట్ చార్జీలు 8 సంవత్సరాల తర్వాత 40 శాతం ప్రస్తుత ప్రజా ప్రభుత్వం పెంచిందని, కాస్మెటిక్ చార్జీలను 16 సంవత్సరాల తర్వాత 200 శాతం పెంచడం జరిగింది.డైట్ చార్జీలను 3 నుంచి 7వ తరగతి విద్యార్థులకు 950 నుంచి 1330 రూపాయలకు, 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 1100 నుంచి 1540 రూపాయలకు, ఇంటర్ నుంచి పీజీ విద్యార్థులకు 1500 నుంచి 2100 రూపాయలకు ప్రజా ప్రభుత్వం పెంచింది.అదేవిధంగా కాస్మోటిక్ చార్జీలను బాలికలకు 7వ తరగతి వరకు 55 నుంచి 175 రూపాయల వరకు, 11 సంవత్సరాల వయస్సు పైగల బాలికలకు 75 నుంచి 275 రూపాయలకు, బాలురు 7వ తరగతి వరకు 62 నుంచి 150 రూపాయల వరకు, 11 సంవత్సరాల వయస్సు పైగల బాలురు 62 నుంచి 200 రూపాయలకు పెంచడం జరిగింది. ప్రజా ప్రభుత్వం పెంచిన డైట్ చార్జీలు కాస్మోటిక్ చార్జీలు రాష్ట్రంలోని 8 లక్షల మంది విద్యార్థులకు ఉపయోగపడ నున్నాయి.దీని వల్ల ప్రభుత్వానికి ప్రతి సంవత్సరం 470 కోట్లు అదనపు భారం పడుతుంది. యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం గురించి తల్లిదండ్రులకు కామన్ డైట్ లాంచ్ సందర్భంగా తెలియజేయ నున్నారు.రాష్ట్రంలోని విద్యాసంస్థల్లో ఫుడ్ పాయిజన్ కేసులు తగ్గించేందుకు ప్రభుత్వం టాస్క్ ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేసింది. కిచెన్, డైనింగ్ ఏరియాలను శుభ్రంగా, ఆ ప్రాంతాలను ఎప్పుడు శుభ్రంగా ఉంచుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలు పకడ్బందీగా చేపట్టడం జరిగింది.

# అల్లు అర్జున్ అరెస్టుపై స్పందించిన సీఎం





టాలీవుడ్ నటుడు అల్లు అర్జున్ అరెస్ట్ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లు అర్జున్ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. ఇందులో తన జోక్యం ఏమీ ఉండదని.. చట్టం ముందు అందరూ సమానులేనన్నారు. చట్టపరమైన ప్రక్రియ జరుగుతుందన్నారు. తొక్కిసలాటలో ఒకరు చనిపోయిన నేపథ్యంలో పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని.. మోహన్ బాబు విషయంలో కోర్టు ఉత్తర్వులున్నాయన్నారు. ఈ నెల 4న ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సంధ్య థియేటర్‌లో పుష్ప-2 బెనిఫిట్ షో సందర్భంగా వచ్చారు. ఆ సమయంలోనే ఒక్కసారిగా తొక్కిసలాట జరిగింది. ఈ క్రమంలో రేవతి అనే మహిళ మృతి చెందింది. ఆమె కుమారుడు గాయాలకు గురయ్యాడు. ఘటనలో మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు అల్లు అర్జున్‌తోపాటు పలువురిపై కేసులు నమోదు చేశారు. ఇప్పటికే ఈ వ్యవహారంలో ముగ్గురిని అరెస్టు చేశారు. అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేశారు. అల్లు అర్జున్‌పై బీఎన్ఎస్ 118 (1), బీఎన్ఎస్ 105, రెడ్‌విత్ 3/5 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. రేవతి మృతిపై అల్లు అర్జున్ దిగ్భ్రాంతి వ్యక్తం చేయడంతో పాటు ఆమె కుటుంబానికి రూ.25లక్షల సాయం ప్రకటించారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ క్రమంలో అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్టు చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్టు అనంతరం గాంధీ ఆసుపత్రిలో పరీక్షలు చేశారు. ఆ తర్వాత ఆయనను కోర్టులో హాజరుపరుచనున్నారు. మరో వైపు పుష్ప స్టార్ తరపు న్యాయవాదులు హైకోర్టును ఆశ్రయించారు.

# గాయపడ్డ జర్నలిస్టుకు మోహన్‌బాబు లేఖ



మంచు ఫ్యామిలీలో జరుగుతున్న గొడవల నేపథ్యంలో సినీ నటుడు మంచు మోహన్ బాబు జర్నలిస్ట్‌పై దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడి ఘటనలో టీవీ9 జర్నలిస్ట్ రంజిత్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనతో ఆగ్రహించిన జర్నలిస్ట్ సంఘాలు.. మోహన్ బాబు క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దాడి ఘటనలో గాయపడిన జర్నలిస్ట్‌కు మోహన్‌బాబు ఎట్టకేలకు క్షమాపణలు చెప్పారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా బహిరంగ లేఖ విడుదల చేశారు. కుటుంబ వివాదం ఘర్షణకు దారి తీసినట్లు చెప్పారు. ఈ ఘటనలో ఓ జర్నలిస్ట్ సోదరుడు గాయపడటం తనకు బాధ కలిగించిందని అన్నారు. ఈ ఘటన తర్వాత అనారోగ్యం కారణంగా 48 గంటల పాటు ఆసుపత్రిలో చేరడంతో వెంటనే స్పందించలేకపోయానని వివరణ ఇచ్చారు. ఆ రోజు తన ఇంటిగేటు విగిరిపోయిందని.. దాదాపు 30 నుంచి 50 మంది వ్యక్తులు ఇంట్లోకి చొచ్చుకొచ్చినట్లు వివరించారు. ఆ సమయంలో సహనాన్ని కోల్పోయినట్లు చెప్పారు. పరిస్థితి అదుపు చేసే క్రమంలో జర్నలిస్ట్‌కు గాయమైందని.. ఇది చాలా దురదృష్టకరమన్నారు. అతడికి, ఆయన కుటుంబానికి కలిగిన బాధకు తాను తీవ్రంగా చింతిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు హృదయపూర్వకంగా క్షమాపణలు కోరుతున్నట్లు లేఖలో పేర్కొన్నారు. గాయపడ్డ జర్నలిస్ట్ త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా మోహన్‌బాబు కాంక్షించారు.

# దుస్తులు మార్చుకోవటానికీ టైం ఇవ్వరా..? - అల్లు అర్జున్



సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో చిక్కడపల్లి పోలీసులు సినీ నటుడు అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేశారని తెలిసిందే. అయితే అరెస్ట్ చేసే సమయంలో బన్నీ నివాసం దగ్గర హైడ్రామా కొనసాగింది. పోలీసుల తీరుపై అల్లు అర్జున్ అసహనం వ్యక్తం చేశాడు. పోలీసులు తనను తీసుకెళ్లడంలో అభ్యంతరం లేదన్న అల్లు అర్జున్ ఉన్న పళంగా తమతో రావాలంటే ఎలా..? దుస్తులు మార్చుకునేందుకు అవకాశం కూడా ఇవ్వరా..? అంటూ ప్రశ్నించాడు. దీంతో పోలీసులు అల్లు అర్జున్ బెడ్‌రూం వరకు వెళ్లి డ్రస్ మార్పించి టీ షర్ట్, షార్ట్‌లో పీఎస్‌కు తీసుకెళ్లారు.అల్లు అర్జున్‌తోపాటు తండ్రి అల్లు అరవింద్ కూడా వాహనం ఎక్కాడు. అయితే తండ్రిని వాహనం ఎక్కొద్దంటూ వారించి కిందికి దించేశాడు. ఏం జరిగినా.. మంచైనా చెడైనా అంతా నాదేనంటూ చెప్పాడు. పోలీసుల రాక నేపథ్యంలో బన్నీ సతీమణి స్నేహారెడ్డి కన్నీళ్లు పెట్టుకుంది. దీంతో ఆమెను దగ్గరకు తీసుకొని ధైర్యం చెప్పాడు అల్లు అర్జున్.

# సంక్రాంతికి మీ ఇంటికొస్తున్నాం : విక్టరీ వెంకటేశ్






క్లాస్, మాస్, కామెడీ, ఫ్యామిలీ.. ఇలా అన్ని జోనర్లలో సినిమాలు చేస్తూ కోట్లాదిమంది అభిమానులను సంపాదించుకున్నాడు టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్. తనదైన కామిక్ స్టైల్ ఆఫ్ యాక్షన్‌తో ఎంటర్‌టైన్ చేసే వెంకీమామ పుట్టినరోజు నేడు. ఈ సందర్భంగా ఇండస్ట్రీ ప్రముఖులు, అభిమానులు, మూవీ లవర్స్, ఫాలోవర్లు వెంకీ మామకు బర్త్ డే విషెస్ తెలియజేస్తున్నారు. తాజాగా అనిల్ రావిపూడి టీం పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ సంక్రాంతికి వస్తున్నాం నుంచి మీను సాంగ్ ప్రోమోను విడుదల చేశారు. మీనాక్షి చౌదరి గురించి ఈ పాట ఉండబోతున్నట్టు ప్రోమో చెబుతోంది. సాంగ్‌లో వెంకీ పోలీసాఫీసర్‌గా సూపర్ స్టైలిష్‌గా కనిపిస్తూ ఘర్షణ సినిమాను మరోసారి గుర్తుకు తెస్తున్నాడు. ఇప్పటికే గోదారి గట్టు మీద రామసిలకవే.. ఓ.. గోరింటాకెట్టుకున్న సందమామవే అంటూ సాగే ఫస్ట్ సింగిల్‌కు నెట్టింట సూపర్ రెస్పాన్స్ వస్తోంది. భాస్కర భట్ల రాసిన ఈ పాటను రమణ గోగుల, మధుప్రియ పాడగా.. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించాడు. ఈ మూవీ 2025 సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రంలో పాపులర్ మరాఠీ యాక్టర్, యానిమల్ ఫేం ఉపేంద్ర లిమాయే, కోలీవుడ్ నటుడు వీటీవీ గణేశ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ట్రయాంగిల్ క్రైమ్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీని దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు.

# గూస్‌బంప్స్ తెప్పిస్తున్న డాకు మహారాజ్

బాబీ దర్శకత్వంలో నందమూరి బాలకృష్ణ హీరోగా నటిస్తోన్న చిత్రం డాకు మహారాజ్. ఎన్‌బీకే 109గా వస్తోన్న ఈ చిత్రంలో బాలకృష్ణ టైటిల్ రోల్‌లో నటిస్తున్నాడు. సంక్రాంతి కానుకగా 2025 జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా ఈ మూవీ ఫస్ట్ సింగిల్ ప్రోమోను విడుదల చేశారు. దేగ దేగ దేగ.. అంటూ సాగుతున్న ప్రోమో గూస్ బంప్స్ తెప్పిస్తోంది. అనంత్ శ్రీరామ్ రాసిన ఈ పాటను నకాశ్ అజీజ్ పాడాడు.



బాలకృష్ణ గండ్రగొడ్డుళ్లు పట్టుకొని సమరంలో ఉన్న లుక్ ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతోంది. ఈ మూవీలో బాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్ ఊర్వశి రౌటేలా, శ్రద్ధా శ్రీనాథ్ ఫీమేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తుండగా.. బాబీ డియోల్ విలన్‌గా నటిస్తున్నాడు. ప్రగ్యాజైశ్వాల్, చాందినీ చౌదరి ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ , సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మేకర్స్ యూఎస్ఏ టెక్సాస్‌లోని డల్లాస్‌లో 2025 జనవరి 4న %ువఇఘం ుతీబర్ జఖ ుష్ట్రమ్తీవ%లో సాయంత్రం 6 గంటల నుంచి ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించనున్నట్టు ఇప్పటికే ప్రకటించారు.